ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య జిల్లా వార్తలు

3

సోమవారం 19 ఆగస్టు 2024



నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్) ఆగస్టు 18: ప్రజల సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 19వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని రాయచోటిలో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలకు పరిష్కారం దొరకని అర్జీదారులు కలెక్టర్ కార్యాలయానికి రావాలని ఆయన కోరారు.

చెయ్యేరును తోడేస్తున్నారు

- కోట్లు గడిస్తున్న ఇసుకాసురులు
- కోడూరు, రాజంపేటల్లో భారీ ఇసుక దందా
- రాత్రింబవళ్లు యథేచ్ఛగా 200 వాహనాల్లో ఇసుక తరలింపు
- పట్టించుకోని అధికారులు
- రోజువారీ లక్షలు గడిస్తున్న అక్రమార్కులు



అడపాదడపా కేసులు పెట్టి పోలీసుస్టేషన్లకు తరలించిన ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

రాజంపేట, ఆగస్టు 18: రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని చెయ్యేరు నదిని ఇసుకాసురులు దోచేస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలింపు ద్వారా రోజూ లక్షల రూపాయలు దోచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నూతన ఇసుక పాలసీ ప్రవేశపెట్టనున్న సందర్భంలో ప్రభుత్వ జీవోలు రావడం ఆలస్యం కావడంతో దీనిని అదునుగా చూసుకుని ఇసుకాసురులు చెయ్యేరును అడ్డంగా కొల్లగొడుతున్నారు. ప్రతిరోజూ 200 పైబడి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఇసుక దందాలో ఆరితేరిన ఇసుక అక్రమ రవాణాదారులు తమ పని కానిచ్చేస్తున్నారు. నెల రోజులుగా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలోని సుమారు 60 కిలోమీటర్ల దూరంలో చెయ్యేరును పూర్తిగా కొల్లగొడుతున్నారు. ఏకంగా జేసీబీలు కూడా ఏర్పాటు చేసుకుని ఆయా ప్రాంతాల్లో ట్రాక్టర్లను, టిప్పర్లను పెట్టుకుని ఈ దందా కొనసాగిస్తున్నారు. ప్రధానంగా రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం నారాయణనెల్లూరు కేంద్రంగా పెద్దఎత్తున ఈ ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఒక్క నారాయణనెల్లూరు గ్రామ సమీపంలో ఊరికి ఆనుకుని ఉన్న చెయ్యేరును పూర్తిగా తోడేస్తున్నారు. పెద్దపెద్ద యంత్రాలతో ఇసుకను తోలడం వల్ల అక్కడ భూగర్భజలాలు అడుగంటి ఆయా గ్రామాలకు తాగునీటి సమస్య జటిలమయ్యే ప్రమాదం ఏర్పడింది. అదేవిధంగా అదే ప్రాంతంలోని కోమంతరాజుపురం, మందరం, అత్తిరాల, ఎస్ఆర్ పురం, ఓబిలి ప్రాంతాల్లోని చెయ్యేరులో ఈ ఇసుక దోపిడీ జరుగుతోంది. ఈ ఇసుకను ప్రత్యేక యంత్రాల ద్వారా కొందరి పొలాల్లోకి డంప్ చేసి అక్కడి నుంచి కోడూరు, చిట్వేలి, పెనగలూరు, నందలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేస్తున్నారు.

రైల్వేకోడూరులో ఒక టిప్పరు ఇసుక 35 వేల రూపాయలకు అమ్ముతున్నారు. ట్రాక్టర్ ఇసుక 8 వేలకు అమ్ముతున్నారు. ఇదే పరిస్థితిలో ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, రాజంపేట ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. కొందరు ఇసుకాసురులు జేసీబీలు, టిప్పర్లను ఏర్పాటు చేసుకుని రాత్రింబవళ్లు ఇసుక దోచేయడమే పనిగా పెట్టుకున్నారు. దీనివల్ల ఒక్కొక్క ఇసుకాసురుడు రోజుకు 5 నుంచి 20 వాహనాల్లో ఇసుకను అక్రమ రవాణా చేస్తూ లక్షల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. కొత్త ప్రభుత్వంలో నూతన అధికారులు బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంలో ఆ అధికారులకు తాము అధికార పార్టీ నాయకులమని, తమ జోలికి రావద్దని హెచ్చరికలు జారీ చేస్తూ తమ నాయకుల ద్వారా పలుకుబడిని ఉపయోగించి ఈ అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాం నుంచి నూతన ప్రభుత్వంలో ఇప్పటివరకు బదిలీ కాని ఎస్ఈబీ అధికారులు ఇందులో కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఓ ఎస్ఈబీ ప్రధాన అధికారికి రోజువారీ ఒక్క నారాయణనెల్లూరు నుంచి ఒక్కో ఇసుకాసురుడు వేల రూపాయలు ముడుపులు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రత్యేక ఎస్ఈబీ అధికారులు ఎలాగో తాము బదిలీపై వెళతామని అనుకుంటూ రోజువారీ వచ్చే ముడుపులు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ ఈ ఇసుక అక్రమ రవాణాకు తోడ్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదులు చేసినా లేదా ప్రసార మాధ్యమాల్లో వచ్చినా ఒకటి రెండు వాహనాలు పట్టుకుని చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోట్లు కొల్లగొట్టారు. ప్రభుత్వం మారినా వారి హవా తగ్గలేదు. ఇప్పుడు కూడా ఆ వైసీపీ నాయకులే కీలకపాత్ర పోషిస్తూ అధికారులకు పెద్దఎత్తున ముడుపులు ఇస్తూ ఈ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. రాజంపేట నియోజకవర్గంలో అటవీ ప్రాంతమైన బాలరాజుపల్లె నుంచి నందలూరు, పెనగలూరు, రాజంపేట, మండల కేంద్రాల్లో చెయ్యేరు నది ప్రవహిస్తుంది. చెయ్యేరునది ఇసుక రేణువులకు పెట్టింది పేరు. నాణ్యమైన ఇసుక ఇక్కడ లభిస్తుండడం వల్ల గతంలో బాలరాజుపల్లె, మందపల్లె, గుండ్లూరు, అత్తిరాల, మందరం, ఓబిలి, కోమంతరాజుపురం తదితర ప్రాంతాల్లో ఒక్కో సమయంలో కొన్ని గ్రామాల్లో ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి ఇసుక రవాణాకు అనుమతులు ఇచ్చేది. ఈ మూడు మండలాల పరిధిలో చెయ్యేరునది పరివాహక ప్రాంతంలో సుమారు వంద గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో భారీ ఎత్తున ట్రాక్టర్‌లు ఉన్నాయి. వీరు రాత్రివేళ తమ గ్రామానికి ఆనుకుని ఉన్న చెయ్యేరు నదిలో ఉన్న ఇసుకను తన ట్రాక్టర్లలో నింపుకుని తెల్లవారేలోపు రవాణా చేసి రోజూ సొమ్ము చేసుకోవడం పరిపాటి. ప్రస్తుతం ఒక్క నారాయణనెల్లూరులోనే 30 ట్రాక్టర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక మిగిలిన గ్రామాల్లో ప్రతి గ్రామంలోను 20 ట్రాక్టర్లు తక్కువగా లేవు. వీరందరూ ఇసుకను అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడడం, నూతన ఇసుక పాలసీ విధానాన్ని తీసుకుస్తున్న సందర్భంలో ఇసుక సరఫరా ఆలస్యం అవుతుండడంతో భవన నిర్మాణదారులకు పెద్దఎత్తున ఇసుక కొరత ఏర్పడింది. దీనిని అదునుగా చూసుకుని మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. చెయ్యేరునది పరివాహక ప్రాంతాల్లో రాత్రివేళ అక్రమ ఇసుక రవాణాదారుల ట్రాక్టర్లు, జేసీబీల మోటుతో నిద్రపోలేని పరిస్థితి ఏర్పడింది. చెయ్యేరును ఆనుకుని గ్రామాలు ఉండడమే వీరికి శాపంగా మారింది. ప్రతి గ్రామంలో 10 ట్రాక్టర్లకు తక్కువ లేకుండా 30 వరకు ఉండడంతో ఈ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే ట్రాక్టర్లదారులు ఆయా గ్రామాల్లో లెక్కచేయకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తూ భారీ ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు ఇసుక అక్రమ రవాణాలో ఆరితేరిన ఇసుకాసురులు కొందరు అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని, ప్రత్యేక టిప్పర్లను, జేసీబీలను ఏర్పాటు చేసుకుని రాత్రింబవళ్లు ప్రధాన రహదారుల గుండా యథేచ్ఛగా రెండు నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తూ ఈనెల రోజుల్లో లక్షలకు పడగలెత్తడం గమనార్హం. ప్రధానంగా ఈ ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన యంత్రాంగం ఉదాసీనత వైఖరి, అవినీతి వ్యవహారమే ఈ భారీ ఇసుక దోపిడీకి ప్రధాన కారణమని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.



ప్రత్యేక డంప్‌లు ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా రవాణా అవుతున్న ఇసుక

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి..



ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలి. నదీ పరివాహక గ్రామాల్లో ఈ ఇసుక అక్రమ రవాణా సాగడం బాధాకరం. నూతన ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీకి శ్రీకారం చుట్టిన సమయంలో అక్రమ ఇసుక రవాణా చేయడం తగదు. ఈ విషయంలో అందరం ఏకమై ప్రభుత్వ విధానానికి అనుగుణంగా నడుచుకుని ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి.

\- మేకా నరసింహులు, టీడీపీ నాయకుడు, రాజంపేట మండలం

చెడ్డపేరు తేవడం మంచిది కాదు..



కొందరు గత వైసీపీ నాయకులు గత ప్రభుత్వం నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ కోట్ల రూపాయలు సంపాదించారు. తిరిగి నూతన ప్రభుత్వంలో కూడా ఈ వైసీపీ నాయకులే ఇసుక అక్రమ రవాణా చేస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారు. ఇటువంటి వారి పట్ల అందరం అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే ఇసుక అక్రమ రవాణాదారులపై చర్యలు తీసుకోవాలి.

\- ఎస్వీ రమణ, సంఘ సేవకుడు, గీతాంజలి విద్యా సంస్థలు, రాజంపేట

ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటాం..



ఇసుక అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే నిఘా వేసి కేసులు నమోదు చేస్తాం. ఇసుక అక్రమ రవాణాకు ఎవరికీ అనుమతి లేదు. తమకు ఏ ఇసుక అక్రమ రవాణాదారులతో కూడా సంబంధాలు లేవు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే అనేక వాహనాలు పట్టుకుని కేసులు నమోదు చేశాం.

\- పవన్‌కుమార్, ఎస్ఈబీ అధికారి, రాజంపేట

హిందువులపై సాగుతున్న దమనకాండ ఆపాలి

● హిందూ ఐక్యత ర్యాలీలో పలు హిందూ సంఘాల నాయకులు

కడప (కల్చరల్), ఆగస్టు 18: రిజర్వేషన్ల సాకుతో హిందువులపై బంగ్లాదేశ్‌లో సాగుతున్న దమనకాండను వెంటనే ఆపాలని పలు హిందూ సంఘాల నాయకులు హెచ్చరించారు. కాదు, కూడదు.. అని మరింతగా రెచ్చిపోయి హిందువులపై దాడులకు తెగబడితే సహించేది లేదన్నారు. ఇందుకు నిరసనగా హిందూ సంఘాల సమన్వయంతో హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఎన్‌జీవో కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి నగర అప్సర సర్కిల్, క్రిష్ణాసర్కిల్, ఏడురోడ్లకూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ చైతన్యవేదిక అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రామమహేశ్, బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, హిందూ సంఘాల నాయకులు విజయానందరెడ్డి, జనసేన నాయకుడు సుంకర శ్రీనివాస్, టీడీపీ నాయకుడు దుర్గాప్రసాద్‌లు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లో ఒక వర్గానికి చెందిన ముష్కరులు పనిగట్టుకుని మరీ హిందూ దేవాలయాలు, హిందువులు, హిందూ మహిళలపై దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ముష్కరుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన హిందువుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల ముసుగులో బంగ్లాదేశ్‌లో అల్లకల్లోలం సృష్టించేందుకు హిందువులను పావులుగా వాడుకున్నారని నిప్పులు చెరిగారు. దాడుల్లో మహిళలు, బాలికలపై అకృత్యాలకు పాల్పడడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా బంగ్లాదేశ్‌లో సాగుతున్న హింసాకాండను ఆపేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో యావత్ హిందువులను ఏకతాటిపైకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తుంగా రమణయ్య, భాస్కరవర్మ, శివకేశవ, ఏవీఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి, డాక్టర్ ఉరిమి జనార్ధన్, రామకృష్ణారెడ్డి, న్యాయవాది భారవి, రామమోహన్‌రెడ్డి, హిందూ సంఘాలు, బ్రాహ్మణ సంఘాల నాయకులు సతీష్ శశిధర్‌శర్మ, వారణాసి శ్రీధర్‌శర్మ, హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీగా వస్తున్న హిందువులు

కృష్ణానది బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి

● తులసిరెడ్డి

వేంపల్లె, ఆగస్టు 18: కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటుచేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టం ప్రకారం ఏపీలో ఏర్పాటు చేయాలి, పదేళ్లు దాటినా ఇప్పటికీ తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉడడం శోచనీయమన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆధ్వర్యంలో గోదావరి నది మీద ఆంధ్రప్రదేశ్‌లో రాజమండ్రికి సమీపాన నిర్మాణం జరుగుతోందని, కార్యాలయం కూడా ప్రాజెక్టు సమీపంలో రాజమండ్రిలో ఉండాలన్నారు. ఈ కార్యాలయాల ఏర్పాటుకు చంద్రబాబు ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే దిగువన నీటి అవసరం లేకపోయినా జలవిద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం ప్రాజెక్టు నుంచి రోజుకు 6.25 టీఎంసీల నీరు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు ఉపయోగిస్తున్నాయన్నారు. అయితే ఆ నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు వాడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ పూర్తి సామర్థ్యం 44 వేల క్యూసెక్కులు ఉందని, కానీ ప్రస్తుతం 25 వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారన్నారు. ఈ ప్రకారం అయితే రాయలసీమలోని గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం, పైడిపాళెం, సీబీఆర్ తదితర రిజర్వాయర్లు నిండవని తెలిపారు.

రైల్వేకోడూరులో పిచ్చి కుక్కల స్వైరవిహారం

● 30 మందికి పైగా గాయాలు ● ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స ● తిరుపతికి కొందరు తరలింపు





కోడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న పిచ్చి కుక్క బాధితులు.. తీవ్రంగా గాయపడిన రామ్‌చరణ్‌ను తిరుపతికి తరలిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, ఆగస్టు 18: పట్టణంలో ఆదివారం పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేశాయి. 30 మందికి పైగా తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారంతా సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స చేయించుకోగా కొందరిని తిరుపతికి తరలించారు. వివరాల్లోకి వెళితే... రైల్వేకోడూరు పట్టణంలోని గాంధీనగర్, పగడాలపల్లె, ప్రధాన దారి, రంగనాయకులపేట, బాలానగర్ మండలంలోని రెడ్డివారిపల్లె తదితర ప్రాంతాల్లో పిచ్చికుక్కలు చిన్నారులు, పెద్దలపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచాయి. ప్రధానదారిలో బస్సులు దిగిన ప్రయాణికుడిపై కుక్కలు దాడి చేశాయి. అలాగే బట్టల దుకాణంలోకి ప్రవేశించి యజమానిపై కుక్క దాడి చేసింది. రక్తగాయాలు అయిన వారికి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు హరిక్రిష్ణ, సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. అందుబాటులో ఉన్న కుక్క సూదులను వేశారు. తీవ్రంగా గాయపడ్డ వారిని తిరుపతికి పంపామని తెలిపారు. రెడ్డివారిపల్లెలోని ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారి (3)పై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. కోడూరు టౌన్‌లోని పగడాలపల్లెలో ఆడుకుంటున్న చిన్నారి జష్విక్కాపై దాడి చేసి గాయపరచింది. అలాగే నారాయణరెడ్డి, రమేష్‌నాయుడు, సురేంద్ర, నిషాంత్‌రెడ్డి, శ్రీనివాసులు, జష్విక్కా, రామ్‌చరణ్ తదితరులు గాయపడ్డారు. ఇదిలా ఉండగా రైల్వేకోడూరు పట్టణంలో కుక్కలు ప్రతి వీధిలోను విపరీతంగా సంచరిస్తున్నాయి. పంచాయితీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలపై పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీధికి 20కుక్కలు ఉన్నాయి. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకున్న పాపానపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచు కుని పంచాయతీ అధికారులు చర్యలు తీసుకుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వీవీఎంతో విద్యార్థుల్లో మేథో సంపత్తి

● 6 నుంచి 11వ తరగతి వరకు పోటీ పరీక్షలు ● జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి



పోటీ పరీక్షల బ్రోచర్లను విడుదల చేస్తున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, తదితరులు

రాయచోటిటౌన్, ఆగస్టు 18: విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో మేథాసంపత్తి పెరుగుతుందని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక డీఈవో కార్యాలయంలో జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ, ప్రచార విజ్ఞాన భారతి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిభ అన్వేషణ పరీక్షను నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పోటీ పరీక్షల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు దేశంలోని సీఎస్ఐఆర్ భార్క్, డీఆర్‌డీవోలతో పాటు ప్రముఖ పరిశోధనా సంస్థలలో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ పొందే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6నుంచి పదవ తరగతితో పాటు ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ చదువుతున్న విద్యార్థులకు స్టేట్ బోర్డు, సీబీఎస్ఈ, ఎన్సీఈఆర్టీ సిలబస్ వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారన్నారు. జూనియర్ విభాగంలో (6 నుంచి 8 తరగతులు), సీనియర్ విభాగంలో (9 నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులు) వరకు ఓపెన్ బుక్ పద్ధతిలో ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తారన్నారు. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఈ పోటీ పరీక్షకు దరఖాస్తు గడువు సెప్టెంబరు 15 వరకు ఉందని, నమూనా పరీక్ష అక్టోబరు 10న ఉంటుందన్నారు. అలాగే ఈ పరీక్షకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సెప్టెంబరు 15 వరకు ఉంటుందని, ఫీజు రూ.200 ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పాఠశాల స్థాయి పరీక్ష అక్టోబరు 23, 27వ తేదీల్లో ఏదో ఒక లాగిన్ అయిన ఒకటిన్నర గంటలోపు పరీక్ష పూర్తి అవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయి పరీక్ష నవంబర్ 26న గానీ, డిసెంబరు 3, 10, 17వ తేదీల్లో ఉంటుందన్నారు. ఈ పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 90 నిమిషాల పాటు మాత్రమే ఉంటుందన్నారు. పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఒకసారి మాత్రమే లాగిన్ అవ్వాలన్నారు. జాతీయ స్థాయి విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు. విద్యార్థి విజ్ఞాన్ మంథన్ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ డీఆర్ డీవో, ఇస్రో సీఎస్ ఐఆర్ వంటి ప్రఖ్యాత జాతీయ ప్రయోగశాలలు, పరిశోధన సంస్థల్లో 1 నుండి 3 వారాలు ప్రత్యేక శిక్షణతో పాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద ఏడాది పాటు నెలకు ఉపకార వేతనంగా కూడా అందజేస్తారన్నారు. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థి విజ్ఞాన్ మంథని పరీక్ష రాసేందుకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వీవీయవోఆర్‌జీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు అవ్వాలన్నారు. దరఖాస్తులు గూగుల్‌ప్లే స్టోర్‌లో వీవీయం యాప్‌ను డౌన్‌లోడ్ చేసి నింపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ ఓబుల్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, అపస్ అధ్యక్షులు నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి మధుతి, కౌశల్, జాయింట్ కోఆర్డినేటర్ గోవింద్‌నాగరాజు, అర్చనా కాలేజీ కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ ఏవోఎం సమీవుల్లా పాల్గొన్నారు.

నిలిచిన ముగ్గురాళ్ల రవాణా

● రైల్వేకోడూరులో లారీల యజమానుల నిరసన

రైల్వేకోడూరు, ఆగస్టు 18: మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో ముగ్గురాళ్ల రవాణా ఆగిపోవడంతో సిబ్బందితో పాటు తాము ఉపాధి కోల్పోయామని లారీల యజమానులు ఆదివారం నిరసనకు దిగారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పాపాలు మూటగట్టుకున్న ప్రజాప్రతినిధులపై నిగ్గు తేల్చాలని, మంగంపేట ముగ్గురాళ్ల గనుల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను కూటమి ప్రభుత్వం లోతుగా విచారిస్తున్న సందర్భంలో రవాణాను ఆపేసిన విషయం విదితమే. దీనిపైన ఆధారపడిన లారీల యజమానులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రైల్వేకోడూరులో లారీల యజమానులు, సిబ్బంది కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లారీల యజమానులు వేమల సభాపతి, జగత్పతి, కేశవులు మాట్లాడుతూ మంగంపేట ముగ్గురాళ్లు, పౌడర్‌లను లారీల్లో నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం క్రిష్ణపట్నం పోర్టుకు, తమిళనాడు చెన్నై హార్బర్‌కు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. 18 టైర్ల లారీలు కనీసం 300 లారీలు ఉన్నాయన్నారు. నెలకు 1.50 లక్షల టన్నుల వరకు చెప్పిన సమయంలో రెండు హార్బర్లకు 15 ఏళ్లుగా ఎగుమతి చేసి ఉపాధి పొందుతున్నామని తెలిపారు. ఈ లారీలు మంగంపేట ముగ్గురాయి, పౌడరు మాత్రమే ఎగుమతికి పనికి వస్తాయన్నారు. వేరే లోడింగ్‌కు పనికి రావని తెలిపారు. 120 మంది లారీల యజమానులు ఉన్నారన్నారు. ముగ్గురాళ్లు, పౌడర్ ఎగుమతి చేయడానికి లారీలను వివిధ కంపెనీల దగ్గర ఫైనాన్స్ తీసుకుని ఉన్నామని తెలిపారు. బెరైటీస్ ఆగిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. లారీలకు తెచ్చుకున్న ఫైనాన్స్‌ను కూడా కట్టుకోలేక కష్టాలు పడుతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిందని, తమ ఇబ్బందులు పోతాయని అనుకున్న సమయంలో రాయి రవాణా నిలిపివేశారన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు వినతిపత్రం పంపామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, చాంద్‌బాషా, సునీల్, మణి, నవీన్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరులో ఆందోళన చేస్తున్న లారీల యజమానులు



ముగ్గురాళ్ల రవాణా ఆగిపోవడంతో నిలిచిన లారీలు

పిల్లలకు ఇష్టమైన వాటిని అందించాలి

కడప బాలోత్సవంలో జేసీ అదితిసింగ్



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న జేసీ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18: పిల్లలకు ఇష్టమైన దానిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందించాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో కడప బాలోత్సవం ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాలకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించిన జేసీ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాలు, కడప బాలోత్సవం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. 200 ఏళ్లగా బ్రిటీషు వారు మనల్ని పాలించారని వారి నుంచి మన స్వాతంత్ర్య ఉద్యమ నేతలు విముక్తి కల్పించడానికి ఎందరో ప్రాణత్యాగాలు చేసిన విషయం గుర్తు చేశారు. ప్రతి పిల్లవాడికి ప్రాథమిక హక్కులు అంబేడ్కర్ సారథ్యంలో రచించిన రాజ్యాంగం అందించిందన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం అనుభవించే హక్కు మనకుందని, మన ఆరోగ్యమైన జీవితం కోసం మన చెత్తను ఇతరుల ఇంట్లో వేస్తే అది హక్కు దుర్వినియోగం చేసినట్లవుతుందన్నారు. మన ఆరోగ్యాన్ని మనం సంరక్షించుకుంటూనే ఇతరులకు ఇబ్బంది రాకుండా ఉండడమే మన విధి అని తెలిపారు. పిల్లలకు ఏది ఇష్టమైతే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి కావలసిన సహకారం అందించాలన్నారు. మనం ఏం చేయాలని నిర్ణయించుకుంటామో దానిని మన కెరీర్‌గా మలచుకోవాలని సూచించారు. అనంతరం వైవీయూ డైరెక్టర్ డాక్టర్ మృత్యుంజయరావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కడప ఎంఈఓ గంగిరెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శనరెడ్డి, కడప బాలోత్సవ కమిటీ సభ్యులు రాజశేఖర్ రాహుల్, సునీత, సరస్వతి, మధుసూదన్, ఉషా, తులసి శివరాం తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న జ్యోతిష్య శాస్త్రనిపుణులు సురేశ్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 18: కడపనగరం ఎన్జీఓ కాలనీ ప్రముఖ జ్యోతిష్య శాస్త్ర నిపుణులు ముద్దల సురేశ్‌బాబు, రేష్మ దంపతుల కుమార్తె సునీతషాహరోన్ 16వ పుట్టినరోజును పురస్కరించుకుని ఆదివారం 400 మందికి పైగా పేద మహిళలకు చీరలు, కేక్‌లు పంపిణీ చేశారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని, మరీముఖ్యంగా వస్త్రాలు దానం చేస్తే దేవునికి చేసినట్లేనని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయన్నారు. పెద్దలు చేసే దానాలతో పిల్లల్లో చాలా ప్రభావం చూపిస్తుందన్నారు. మన సంపాదనలో కొంత మేరకైనా అవసరంలో ఉన్న వారికి సహాయం చేస్తే దేవుని ఆశీస్సులు కలుగుతాయన్నారు. సమాజంలో కొంత మందికైనా ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజు, శ్యామల, రేచల్, మనోహర్, నిర్మల, సువార్త, శోభా,భారతి, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు బిర..బిరా కృష్ణమ్మ

- వారం రోజుల్లో ఏడు టీఎంసీలు చేరిక
- నేడు సీబీఆర్, పైడిపాలెంకు నీరు విడుదల


గండికోట ప్రాజెక్టులోకి వేగంగా వస్తున్న కృష్ణమ్మ

కొండాపురం, ఆగస్టు 18: గండికోట ప్రాజెక్టులోకి కృష్ణమ్మ బిరబిరా పరుగులెడుతూ వస్తోంది. దాదాపు రోజుకు ఒక టీఎంసీ నీరు చొప్పున ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఆగస్టు 10న అవుకు రిజర్వాయిర్ నుంచి గండికోట ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయగా వారం రోజుల్లో ఏడు టీఎంసీల దాకా నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయంలో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉండడంతో గండికోటకు నీటిని వేగంగా విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయింత్రానికి గండికోట ప్రాజెక్టులో 8.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ మల్లికార్జునరెడ్డి తెలిపారు. దీంతో చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కొండాపురం వద్ద ఉన్న రెండు లిఫ్ట్ ఇరిగేషన్ పంప్‌హౌస్‌ల ద్వారా సోమవారం ఉదయం 9 గంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వెంటనే సీబీఆర్, పైడిపాలెం రిజర్వాయర్లకు నీటిని విడుదల చేస్తుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ నుంచి వంద క్యూసెక్కులు : ఏఈఈ

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 18: బ్రహ్మంసాగర్ రిజర్వాయరు నుంచి కుడికాల్వ కింద ఉన్న రైతుల అభ్యర్థనల మేరకు వంద క్యూసెక్కులు నీటిని దిగువకు వదలినట్లు ప్రాజెక్టు ఏఈఈ ముద్దం నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రస్తుతం రైతన్నలు వరినాట్లు వేస్తున్న సందర్భంగా రైతన్నల అవసరాల నిమిత్తం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ సూచన, తెలుగుగంగ ఉన్నతాధికారుల అనుమతితో నీటిని దిగువకు వదిలినట్లు ఏఈఈ తెలిపారు. నీటిని పంటలకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

కాల్వ పోరంబోకు స్థలం విక్రయం

చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



ప్రొద్దుటూరు ఆగస్టు 18: పట్టణ పరిధిలోని 35వ వార్డులోని దేవాంగకల్యాణ మండపం వెనుక వున్న మున్సిపల్ కాల్వ పోరంబోకు స్థలాన్ని ఆ వార్డుకు చెందిన ఓ మాజీ కౌన్సిలర్ విక్రయించినట్లు సమాచారం. గతంలో కాల్వ పోరంబోకు స్థలంలో అక్కడ వున్న కొందరు పేదలు గుడిసెలు వేసి ఆక్రమించారు. అందులో రెండు సెంట్లకు పైగావున్న స్థలాన్ని ఓ మాజీ కౌన్సిలర్ 2007లో ఒకరి నుంచి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంటు పుట్టించింది. అగ్రిమెంటు పెట్టుకుని నేడు ఆ స్థలం రూ.16 లక్షలకు విక్రయించినట్లు స్థానికులు వాపోతున్నారు. అది పేదల మున్సిపాలిటీ స్థలం అక్రమంగా అగ్రిమెంటు కాగితాలు పుట్టించి సొమ్ము చేసుకుంటు న్నట్లు వార్డు వాసులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బంది దృష్టికి ఈ కాల్వ పోరంబోకు మున్సిపల్ స్థలం ఖాళీగా వుండడం అది ఒక మాజీ కౌన్సిలర్ అధీనంలో వుండడంపై తెలిసి కూడా ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం గానీ, అక్కడ బోర్డు పెట్టి పరిరక్షించడం గానీ చేయక పోవడంతో గుట్టుచప్పుడు కాకుండా ఆ మాజీ కౌన్సిలర్ మున్సిపాలిటీ స్థలాన్ని విక్రయించి సొమ్ముచేసుకున్నట్లు వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదే కోవలో మరిన్ని స్థలాలు ఆక్రమణకు గురైనా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో అవి అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ కాల్వ పోరంబోకు స్థలం విక్రయంపై మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ఈ విషయం వారి దృష్టికి వచ్చినట్లు అంగీకరించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని పంపి సర్వేచేయించినట్లు తెలిపారు. త్వరలో అక్కడ కాల్వ పోరంబోకు స్థలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలకు మార్కింగ్ ఇస్తామన్నారు. ఈ స్థలానికి మున్సిపల్ స్థలంగా బోర్డు పెడతామన్నారు. ఈ స్థలం ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుమానాలను నివృత్తి చేయండి

తల్లీబిడ్డల మృతిపై నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ ● పోలీసులను ప్రశ్నించిన వైనం

రాయచోటిటౌన్, ఆగస్టు18: స్థానిక తొగటవీధిలో శనివారం తెల్లవారుజామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన యర్రగుడి రమాదేవి(33) ఆమె ఇద్దరు బిడ్డల ఘటనపై ఉన్న అనుమానాలన్నింటినీ పోలీసులు నివృత్తి చేయాలని నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. రమాదేవి ఆమె ఇద్దరు పిల్లలు అనుమానాస్పద స్థితిలో కాలి బూడిదైన విషయంపై పౌరహక్కులు, ప్రజాస్వామ్య హక్కుల సంఘం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, ఎంఆర్‌పీఎస్, రజక సంఘం నేతృత్వంలో ఏర్పడిన నిజనిర్ధారణ కమిటీ స్థానికులను, రక్త బంధువులు, పోస్టుమార్టం నిర్వహించిన డాక్టర్లు, పోలీసులను విచారించి సంఘటనపై వాస్తవాలు తెలుసుకున్నట్లు నిజనిర్ధారణ కమిటీ బృందం నేతలు తెలియజేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ పిల్లలను ముందుగా చంపిన రమాదేవి తర్వాత గ్యాస్ లీక్ చేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసులు నిర్ధారణకు వచ్చి మృతురాలిపైనే హత్య కేసు నమోదు చేయడం సరికాదని కమిటీ అభిప్రాయపడింది. నిజంగా రమాదేవి ఆత్మహత్య చేసుకున్నది నిజమైతే మృతదేహం పక్కనే ఏ మాత్రం కాలని ప్లాస్టిక్ బాటిల్ ఉందని, దానిని పోలీసులు సీజ్ చేసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు, వేలిముద్రల నిపుణులకు పంపించాల్సిన పోలీసులు ఆ పని చేయలేదన్నారు. బెడ్ రూమ్‌లో గ్యాస్ లీక్ చేసి రమాదేవి చనిపోయింది నిజమైతే గదిలో ఉన్న బెడ్, ఇతర వస్తువులు ఏ మాత్రం కాలలేదని, గది అంతా గ్యాస్‌తో నిండిన తర్వాత నిప్పు అంటించుకుని ఉంటే రూమ్ గోడలు మసిబారి ఉండాలి కానీ అలాంటి ఛాయలు అక్కడ లేవన్నారు. బెడ్ రూమ్‌లోనే గ్యాస్ సిలిండర్ ఉందని పోలీసులు చెబుతున్నా ఆసిలిండర్ కాలినట్లు ఏ మాత్రం మరకలు లేవన్నారు. మృతురాలి ఇంటి నుంచి పొగ బయటికి వచ్చిన నిమిషాల్లోపు ప్రత్యక్ష సాక్షులు ఆమె ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే ఏ మాత్రం కదలకుండా పడి ఉన్న మృతదేహాలను చూశామని, ప్రత్యక్ష సాక్షులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారన్నారు. సాధారణంగా ఆత్మహత్యకు పాల్పడిన వారు చివరి క్షణంలో దిక్కుతెలియక పరుగులు పెట్టడం, కేకలు వేయడం జరుగుతుంటాయి. కానీ ఇలాంటి ఆధారాలు ఏమీ తమ దృష్టికి రాలేదన్నారు. కువైట్‌లో ఉన్న భర్త పెట్టే వేధింపులు తాళలేక రమాదేవి పిల్లలతో ఆత్మహత్య చేసు కున్నట్లు పోలీసులు ఇప్పటికే నిర్ధారణకు వచ్చారు. కానీ రమాదేవి చనిపోయేందుకు నాలుగైదు గంట ల ముందు అదే వీధిలోని మరొక మహిళతో మృ తురాలికి ఘర్షణ జరిగిందని, తన భర్తతో వివాహే తర సంబంధం కొనసాగిస్తోందని మృతురాలి ఇంటి ఎదుట రాత్రి రెండు గంటల వరకు రభస చేసి మృతురాలి ఇంటి తలుపులు పగలగొట్టే ప్రయత్నం చేసిందని లోపల చస్తావా..? బయటకు వచ్చి నా చేతిలో చస్తావా..? అని గట్టిగా కేకలు వేసినట్లు కమిటీ దృష్టికి వచ్చిందని తెలిపారు. అనంతరం కువైట్‌లో ఉన్న మృతురాలి భర్త కంట్రోల్‌లో పనిచేస్తున్న సీసీ కెమెరాలు ఆపేసిన విషయం కూడా తెలిసిందన్నారు. అనంతరం రమాదేవి తెల్లవారుజామున తల్లీబిడ్డలు శవాలై తేలినట్లు కమిటీ దృష్టికి వచ్చిందన్నారు. మృతురాలిపై గొడవకు దిగిన మహిళ భర్తకు మృతురాలు లక్షలాది రూపాయలు అప్పుగా ఇచ్చినట్లు ఇటీవల తన డబ్బు తనకు వెన క్కి ఇవ్వాలని మృతురాలు తీవ్రంగా ఒత్తిడి చేసిందని కమిటీ విచారణలో తేలింది. మృతురాలిపై దాడికి దిగిన మహిళ భర్త తన గొంతుకోసుకుని ఆస్పత్రి పాలైనట్లు కూడా కమిటీ దృష్టికి వచ్చిందని తెలియజేశారు. జరిగిన దారుణ సంఘటనపై ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పోలీసులు ఉన్నత స్థాయి అధికారుల చేత విచారణ జరిపి తల్లీబిడ్డల మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. నిజనిర్ధారణ కమిటీ బృందంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెం కటేశ్వర్లు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈశ్వర్, ఎంఆర్‌పీఎస్ జా తీయ నేత రామాంజనేయులు, పౌరహక్కుల సం ఘం ఉపాధ్యక్షుడు రెడ్డెయ్య, ప్రధాన కార్యదర్శి రాయచోటి రవిశంకర్, మోటపోతుల రవిశంకర్, ఇర్షాద్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు రమేశ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.


మృతురాలి కుటుంబీకులను విచారిస్తున్న నిజనిర్ధారణ కమిటీ బృందం

అక్కినేని ఒక విశ్వవిద్యాలయం

అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో వక్తలు


అక్కినేని అభిమానుల నడుమ కళాక్షేత్రంలో అక్కినేని శత జయంత్యుత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఆగస్టు 18: అక్కినేని నాగేశ్వర్‌రావు ఒక విశ్వవిద్యాలయమని, ఆయన జీవితం నుంచి నేర్చుకోవాల్సి అంశాలు ఎన్నో ఉన్నాయని ప్రముఖ వక్తలు అన్నారు. రాయలసీమ అక్కినేని అభిమానుల సమాఖ్య ఆధ్వర్యంలో దివంగత మహానటుడు అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంత్యుత్సవాలను ఆదివారం కడప కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు అక్కినేని సినిమాల్లోని హిట్ పాటల కచేరి నిర్వహించారు. సాయంత్రం 4గంటల నుంచి అక్కనేని హిట్ సినిమాల పాటల క్లిప్‌లను స్క్రీన్‌పై ప్రదర్శించారు. తరువాత చిత్తూరు జిల్లా సిమ్మిసామ గ్రామం విద్యార్థులచే అక్కినేని సినిమా పాటలకు అభినయం చేసి అభిమానులు, ఆహూతులను మెప్పించారు. జూనియర్ అక్కినేని స్వామ్రాట్, స్టేజీ ఆశాలచే ప్రదర్శనలు చేశారు. రాయలసీమ అక్కినేని అభిమానుల సమాఖ్య సభ్యులు శ్రీకంఠం మణిబాబు, వి.ఓంనమశ్శివాయ, కడప రామక్రిష్ణ ఆధ్వర్యంలో రాత్రి నిర్వహించిన సమావేశంలో ప్రముఖ వక్తలు మాట్లాడుతూ మనిషి అన్న తరువాత కాసింత కళాపోషణ ఉండాలన్నారు. అక్కినేని ఒక విశ్వవిద్యాలయం అన్నారు. ఆయన వద్ద నటన మాత్రమే కాదు.. ఎంతో విజ్ఞానం కూడా దాగిఉందన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు మల్లికార్జునరెడ్డి, ఈశ్వరరెడ్డి, ఇన్‌టాక్ కన్వీనరు లయన్ చిన్నపరెడ్డి, మృత్యుంజయరావు, సవేరా ఆర్ట్స్ వెంకటయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు. తరువాత సీనియర్ అభిమానులు, ముఖ్యమైన వక్తలకు సన్మానం చేశారు.

ట్రాక్టర్ బోల్తా - ఒకరికి గాయాలు

పెండ్లిమర్రి, ఆగస్టు 18: చిన్నదాసరిపల్లె సమీప వంక వద్ద నీళ్ల ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ఆదివారం పాతసంగటిపల్లె వాసి గుణవర్ధన్‌రెడ్డి వెయ్యినూతలకోన దేవస్థానంలో బంధువుల వివాహానికి నీళ్ల ట్యాంకర్ తీసుకెళ్లాడు. తిరిగి ట్రాక్టర్‌ను ఇంటికి తీసుకుని వస్తుండగా వంక వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ వంకలో బోల్తాపడింది. ట్రాక్టర్ అతని మీదపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇతన్ని కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వేలూరుకు తరలించారు.

బస్‌షెల్టర్ల నిర్మాణం కోసం రూ.19లక్షలు మంజూరు

పులివెందుల టౌన్, ఆగస్టు 18: స్థానిక మెడికల్ కళాశాల వద్ద బస్‌షెల్టర్ల నిర్మాణానికి రూ.19లక్షలు మంజూరైంది. ఈ మేరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి ఉత్తర్వులు జారీచేశారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (డీఎమ్ఎఫ్) ట్రస్ట్ గ్రాంట్ కింద నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆర్‌అండ్‌బీ పర్యవేక్షణలో రెండువైపుల బస్‌షెల్టర్ల నిర్మాణం సాగనున్నాయి.

మద్యం మత్తులో దాడి ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నూరు, ఆగస్టు 18: చెన్నూరు హైవే కొత్తరోడ్డుపై ఆదివారం రాత్రి మద్యం మత్తులో నలుగురు యువకులు మరో యువకుడిపై దాడి చేయడంతో అతను తీవ్రగాయాల పాలయ్యాడు. సీఐ పురుషోత్తంరాజు వివరాల మేరకు... చెన్నూరు కొత్తరోడ్డుకు చెందిన గంధం సుబ్బరాయుడు అలియాస్ పెద్దచిలక ఆలంఖాన్‌పల్లె సర్కిల్‌లోని దండు వద్ద ఆదివారం సాయంత్రం మద్యం తాగుతుండగా చెన్నూరు వాసులు పేరం రాజా, ప్రసాద్, శ్రీనివాసులరెడ్డి, మరొకరు కలిసి ఏదో మాట్లాడదామని సుబ్బరాయుడిని చెన్నూరుకు పిలిపించుకున్నారు. కొత్త రోడ్డు పెట్రోలు బంకు సమీపంలో మళ్లీ ఐదుగురు కలిసి మద్యం తాగారు. ఈ మత్తులో సుబ్బరాయుడిపై ఉన్న వ్యక్తిగత కక్షలతో మాటామాటా పెంచుకుని ఘర్షణకు దిగారు. సుబ్బరాయుడిని విచక్షణారహితంగా కొట్టారు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రొద్దుటూరు, ఆగస్టు 18: ప్రొద్దుటూరులో ఇసుక రవాణా ఆగడం లేదు. రామాపురం, పెద్దశెట్టిపల్లె, చౌట పల్లె, దొరసానిప ల్లె, రామేశ్వరం, పె న్నానగర్, నంగనూ రు పల్లె, కల్లూరు, రేగళ్ల పల్లె ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పెన్నానది నుంచి ఇసుకను రాత్రిళ్లు తవ్వకాలు జరిపి రవాణా సాగిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఇసుక మాఫి యా తీరు మారలేదు. వారం రోజులుగా పోలీసులు జరిపిన దాడుల్లో రూరల్ స్టేషన్ పరిధిలో 7 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఒకరు మృతి


షరీఫ్ మృతదేహం

మైదుకూరు రూరల్ (దువ్వూరు) ఆగస్టు 18: కృష్ణంపల్లి వాసి షరీఫ్ (42) దువ్వూరులోని ఓ వివాహానికి హాజరై ఇంటికి ఆటోలో వెళ్లా డు. కానగూడురు వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో షరీఫ్ అక్కడికక్కడే మృ తి చెందాడని దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమా ర్ తెలిపారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జిల్లాలో సీఐలు, ఎస్ఐల బదిలీ

కడప (క్రైం), ఆగస్టు 18 : కడప జిల్లా వ్యాప్తంగా ఏడుగురు సీఐలు, 17 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
నరేంద్రరెడ్డి	వీఆర్ అనంతపురం	పీసీఆర్ కడప
అశోక్‌రెడ్డి	డీఎస్పీ	వీఆర్ కడప
నారాయణయాదవ్	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, కడప	వీఆర్ కడప
ఈశ్వరయ్య	వీఆర్, కడప	దిశ, మహిళ, నంద్యాల
శంకరయ్య	ఫ్యాక్షన్ జోన్, కడప	వీఆర్, కడప
దేవకిరణ్‌కుమార్	సైబర్‌క్రైం, కడప	ప్రొద్దుటూరు, ట్రాఫిక్
అబ్దుల్‌నాయక్	ప్రొద్దుటూరు ట్రాఫిక్	సైబర్‌క్రైం, కడప

ఎస్ఐ పేరు	ప్రస్తుత ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
కె.శ్రీకాంత్	శ్రీసిటి పోలీస్, తిరుపతి	బద్వేలు రూరల్
పి.వెంకటసురేష్	వీఆర్, కడప	ప్రొద్దుటూరు రూరల్
డి.సునీల్‌కుమార్‌రెడ్డి	వీఆర్, కడప	సైబర్ క్రైమ్, కడప
సి.లక్ష్మీనారాయణ	వీఆర్, కడప	తలమంచిపట్నం
సి.ద్వారక	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు
ఈ.వెంకటయ్య	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
వి.మల్లిఖార్జునరెడ్డి	వీఆర్, కడప	డీఎస్‌బీ, కడప
బి.ప్రదీప్‌కుమార్	వీఆర్, కడప	డీటీఆర్‌బీ, కడప
ఎస్.శ్రీధర్‌బాబు	వీఆర్, కడప	డీటీసీ, కడప
పీఎస్ రాజ్‌కుమార్	వీఆర్, కడప	ఆర్ఎస్ఏఎస్‌టీఎఫ్, కడప
బి.ప్రకాశ్‌రావు	వీఆర్, కడప	సీసీఎస్, కడప
పి.నారాయణ	వీఆర్, కడప	సీసీఎస్, కడప
ఎంవీ సుబ్బన్న	వీఆర్, కడప	డీఎస్‌బీ, కడప
ఎస్.అనసూయ	దిశ పీఎస్	పీసీఆర్, కడప
వి.లక్ష్మీదేవి	వీఆర్, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
పి.హైమావతి	వీఆర్, కడప	డీఎస్‌బీ, కడప
కె.శాంతమ్మ	వీఆర్, కడప	ఏహెచ్‌టీయూ, కడప

అనుబంధాల రక్షాబంధన్

శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని రాఖీ పౌర్ణమి అని, రక్షాబంధన్ అని పిలుస్తారు. కుటుంబంలో అనుబంధాలను గుర్తు చేసుకుంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలని రక్షాబంధన్ చేసుకుంటారు. అంతేకాకుండా జీవితంలో తమకు రక్షగా నిలవాలని, జీవితాంతం ఒకరికి ఒకరు తోడుంటామని చాటిచెప్పేందుకే సోదరీ మణులు అన్నదమ్ములకు రక్షాబంధన్ కడతారు. దీంతో సంతుష్టులైన అన్నదమ్ములు శక్తి మేరకు కానుకలు అందిస్తారు. రాఖీ కట్టేముందు 'యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః - తేనత్వామభిబధ్నామి రక్షే మా చల మా చల' అని మంత్రం చెప్పి రాఖీ కడితే రాకీ కట్టించుకున్న వారికి రక్షగా నిలుస్తుందని పురాణాలు చెబుతున్నాయి. అంటే 'అత్యంత దయ కలిగిన రాజు బలికి కట్టినఅదే పవిత్రమైన దారాన్ని నేను రనీ మణికట్టుకు కడుతున్నాను. అది నిన్ను కష్టాల నుంచిశాశ్వతంగా కాపాడుతుంది' అని ఈ మంత్రం అర్థం

రాయచోటి(సంబేపల్లె). ఆగస్టు18: సోదర భావం అపురూప సుమం. దానికి ఆత్మీయత అనే గంధం అద్దితే కనిపించే సుందర రూపమే రక్షాబంధన్. రాఖీ పౌర్ణమి సోదరీ సోదరుల అనుబంధ సూచికంగా శ్రావణి పౌర్ణమి నాడు చేసుకునే పండుగ. శ్రావణ పౌర్ణమికి భారతీయ సనాతన సంప్రదాయంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. యుగయుగాలుగా తరతరాలుగా ఈ పర్వదినం అనేక అద్భుత సందర్భాల సమాహారంగా పవిత్ర ఘట్టాలను ప్రతిబింబిస్తోంది. ధర్మ రక్షణ కోసం జరిగిన అవతరణాలు ఆధారంగా నిలుస్తోంది. అన్నకు గానీ, తమ్మునికి గానీ ప్రేమ సూచికంగా సోదరి రాఖీ రక్షణ కట్టడం. ఈ పండుగలోని ప్రధానాంశం. రాఖీ అనే పదం రక్ష లేదా రక్షణ సంబంధమైనది. సోదరి తన సోదరుడి చేతికి రక్షణ సంబంధించి కలకాలం చల్లగా ఉంటూ తనకు రక్షణను కల్పించమని మనస్ఫూర్తిగా కోరుకోవడమే ఈ పవిత్ర కార్యం వెనుక ఉన్న అంతరార్థం. శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున రక్షాబంధన్ పండుగ చేసుకుంటారు. అయితే పురాణాలప్రకారం అసలు ఈ పండుగ చేసుకోవడం ఎప్పటి నుంచి మొదలైంది.

రాఖీ పండుగ ఎలా మొదలైంది

రాఖీ పండుగ వస్తుందంటే చాలు ఎక్కడ చూసినా రకరకాల రాఖీలు దర్శనమిస్తూ ఉంటాయి. ఏ షాపులో చూసినా అందమైన రాఖీలు కనిపిస్తాయి. స్వస్తిక్ గుర్తు రాఖీలు, పూసలు, రంగురాళ్లు, బొమ్మలతో ఉండే అనేక రాఖీలు, ఇప్పుడు మార్కెట్‌లో ఉంటున్నాయి. అయితే తొలి రాఖీ దేనితో కట్టారో తెలుసా..? చీర కొంగుతో కట్టారు. అప్పటి నుంచి ఈ పండుగను చేసుకుంటూ వస్తున్నారు. పూర్వం రాఖీ అంటే రంగుదారంతో కట్టేవాళ్లు.



రక్షాబంధన్ పండుగ ఎలా మొదలైంది

ఇది తొలుత ఉత్తర భారతదేశంలో విశేష ప్రచారంలో ఉంది. ఉత్తర భారతదేశంలో పురాణ సంప్రదాయాలు ఈ పండుగ వెనుక రక్షాబంధన్ గురించి చాలాకథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. మతవిశ్వాసాల ప్రకారం రక్షాబంధన్ కృష్ణుడు ద్రౌపదితో ప్రారంభమైందని నమ్ముతారు. శ్రీకృష్ణుడు దుష్టరాజు, శిశుపాలుడుని చంపాడు. యుద్ధ సమయంలో కృష్ణుడి ఎడమ చేతి వేలికి గాయమై రక్తం కారుతోంది. అది చూసిన ద్రౌపది చాలా దుఃఖించి తన చీర కొంగును చింపి ఆ ముక్కను కృష్ణుడి వేలికే కట్టడంతో రక్తస్రావం ఆగింది. అప్పటి నుంచి కృష్ణుడు ద్రౌపదిని తన సోదరిగా అంగీకరించాడు. పాండవులు జూదంలో ద్రౌపదిని ఓడిపోయినప్పుడు ఆమెను నిండు సభలో వివస్త్రను చేసేందుకు ప్రయత్నించారు. అప్పుడు కృష్ణుడు ద్రౌపది మానాన్ని కాపాడాడడంతో రాఖీ పండుగ మొదలైందని అంటారు.

ఒంటిమిట్టలో నేడు సీతారామ కల్యాణం

ఒంటిమిట్ట, ఆగస్టు 18 : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన కోదండ రామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని టీటీడీ అర్చకులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా, ప్రతి నెల పౌర్ణమి నాడు గిరి ప్రదర్శన నిర్వహించాలని స్థానిక బీజేపీ, ఆర్ఎస్ఎస్ సభ్యులతోపాటు భక్తులు నిర్ణయించారు. కోదండరామాలయం పెద్దకొత్తపల్లి, చిన్నకొత్తపల్లె, గంగపేరూరు, రాచగుంటపల్లె, సాలాబాద్, మలకాటిపల్లె మీదుగా 14 కిలోమీటర్ల మేర నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు రామాలయం నుంచి ప్రదక్షిణ ప్రారంభం అవుతుందని పాటూరు గంగిరెడ్డి తెలిపారు.

మాతమ్మకు పొంగళ్లు

పెనగలూరు, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని అరుంధతివాడలో ఆదివారం సాయంత్రం గ్రామ దేవత మాతమ్మకు మొగిలిచెర్ల కొంచం తప్పిట వంశస్తులు పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగామహిళలు గుడి ముందు పొంగళ్లు పొంగించి ముద్ద పెట్టుకుని కోడిపుంజులను బలిచ్చి గ్రామదేవతను శాంతింపజేశారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

గాలివీడు, ఆగస్టు18: ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. ఇంటికి సమీపంలోని చెట్టు కింద కట్టేసిన ఆవుపై పిడుగు పడడంతో మృతి చెందిందని చీమలచెరువుపల్లి పంచాయతీ గుర్రంవాండ్లపల్లెకు చెందిన గుర్రంనారాయణరెడ్డి తెలిపారు. చనిపోయిన ఆవు ఐదు నెలల గర్భంతో ఉందని , దాని విలువ రూ.70 వేలు చేస్తుందని తెలిపారు.

21 నుంచి ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాలు

రాయచోటిటౌన్, ఆగస్టు18: ఏఐఎస్ఎఫ్ వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల 21 నుంచి 27 వరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల కరపత్రాలను ఆదివారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలు ఆడటం చాటా అరుదుగా కనిపిస్తుందని, దీనివలన విద్యార్థులు మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి అవుతూ శారీరక దృఢత్వాన్ని కూడా కోల్పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, నాయకులు రఘుపతి, విజయ్, వాసుదేవనాయక్, కుమార్‌నాయక్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under instructions from my client M/s Shriram Finance Limited, RAYACHOTY Branch. I issue the following notice. My client company intends to grant a loan facility to **Sri Shaik Fayaz** S/o **Shaik Abdul Kareem,** D.No. 5/127, Chavadikunta, Chinnamandem Village, Post, Chinnamandem Mandal, **Annamayya District** under equitable mortgage by way of deposit of title deeds in respect of the schedule mentioned property. Hence the public at large, banks, financial institutions or any individual money lenders are hereby informed that if any objections regarding the said loan, the public shall inform in writing within seven days from the date of this notice for the below mentioned schedule property, otherwise it shall be deemed that there are no objection from anybody and any objections received after seven days will not binding upon my client's company for the below schedule property. **SCHEDULE OF PROPERTY**:- Annamayya District erstwhile YSR Kadapa District, Rayachoty sub. Reg. Dist. Rayachoty Mandal at Rayac-hoty Village Polam in Sy. No. 485, an extent of **75 Square Yards** out of 150 square yards out of 340 square out of Ac. 12-05 cents. **Bounded by:** East– Site retained by govindu Sudhakara 35 feets width, West - Site sold to Shaik Fayazunnisa, North - Site of Chamarthi Santhamma, Koppala Nagireddy, Govindu Ram-adevi, South - 16 feets width Rasta **Measuring** ; East - West (Width) = 15 feets, North - South (Length) = 45 feets. (Property covered under registered Sale deed No. 8347/2021)

C. SUNIL KUMAR REDDY, B.A., B.L., ADVOCATE, Rayachoty, 9441738746

ఏరులై పారుతున్న నాటుసారా..।



అటవీ ప్రాంతంలో మండుతున్న సారా బట్టీలు



సారా తయారీకి సిద్ధంగా ఊట

● పల్లెల్లో పుట్టుకొస్తున్న బెల్టు షాపులు

సుండుపల్లె, ఆగస్టు 18: గ్రామాలను నాటుసారా రహితంగా తీర్చిదిద్దుతామని వైసీపీ హయాంలో పాలకులు, అధికారులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితం కావడంతో పచ్చని పల్లెల్లో నాటుసారా ఘాటు ముక్కుపుటాలను అదరగొడుతోంది. అటవీ ప్రాంతానికి చేరువలో ఉండడంతో మాచిరెడ్డిగారి పల్లె, ముడుంపాడు, మడితాడు, గుండ్లపల్లి గ్రామ పంచాయ తీల్లో జోరుగా సారా తయారీ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాచిరెడ్డిగారిపల్లె, ముడుంపాడు గ్రామ పంచాయతీల అటవీ పరిసర ప్రాంతాలు, మామిడి తోటలు సారా తయారీకి ఆటపట్టుగా మారాయి. కేవీపల్లె మండలంలో జిల్లేళ్లమంద తాండా నుంచి సుండుపల్లె మండలానికి పింఛా ప్రాజెక్టు మీదుగా నాటుసారా సరఫరా జరుగుతోంది. ఒక బిందెసారా మీద సుమారుగా 10 వేల రూపాయలకు మించి లాభం గడిస్తున్నట్లు సమాచారం. ఇంత లాభం వస్తుండడంతో పలువురు సారా విక్రయాలకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లేళ్ల మంద తాండాతోపాటు పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి, రాయచోటి, పీలేరు వంటి ప్రాంతాలకు సైతం తరలిస్తున్నట్లు సమాచారం. కొంత మంది సారా ప్యాకెట్లు తయారు చేసి వాటర్ ప్యాకెట్లలా ఇంట్లోనే అమ్ముకుంటున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి కేసులు పెడుతున్నారే తప్ప శాశ్వత నిర్మూలనకు చర్యలు చేపట్టడం లేదని మహిళలు వాపోతున్నారు. వైసీపీ హయాంలో మద్యం ధరలు విపరీతంగా పెంచడంతో నాటుసారాకు డిమాండ్ పెరిగినట్లు తెలుస్తోంది.

సారా నిర్మూలనపై దృష్టి



నాటుసారా నిర్మూలనపై దృష్టి సారిస్తున్నాం. మండలంలో బాధ్యతలు స్వీకరించి వారం రోజులు మాత్రమే గడిచింది. సారా తయారీ, అమ్మకాలు, బెల్టుషాపుల నిర్వహణపై ఆరా తీస్తున్నాం. మండలంలో సారా బట్టీలు లేకుండా చేస్తాం. సారా తయారీదారులు ఆ వృత్తిని వదలి, ఇతర పనులు చేసుకోవాలి. సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు, ఎస్ఐ, సుండుపల్లె

మంగంపేట ఆర్ఆర్-5 లో పనులు చేయడం తగదు

● కూటమి నాయకుల హెచ్చరిక

ఓబులవారిపల్లె, ఆగస్టు 18 : వైసీపీ నేతలు అనధికారికంగా పనులు చేయడం తగదని మంగంపేట కూటమి నాయకులు హెచ్చరించారు. ఏపీఎండీసీ డేంజర్‌జోన్ గ్రామాలైన మంగంపేట కాపుపల్లె హరిజనవాడ, అరుంధతివాడలకు పునరావాసంగా కేటాయించిన ఆర్ఆర్-5 లేఅవుట్‌లో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లా చలపతి, పులపత్తూరు రామసుబ్బారెడ్డి, అనుమలగుండం చంద్రమోహన్, గునిపాటి చెన్నరాయుడు తదితరులు మాట్లాడుతూ డేంజర్‌జోన్ గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్ ఆధ్వర్యంలో పద్ధతి ప్రకారం అభివృద్ధి పనులు జరుగుతాయని, వైసీపీ నాయకులు అత్యుత్సాహంతో పనులు చేయడానికి ప్రయత్నిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



ఆర్ఆర్-5 లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎన్డీయే నాయకులు

గ్రామాభివృద్ధికి అందరూ కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాలేకాని, గతంలో లాగా పెత్తనం తగదన్నారు. ఈ కార్యక్రమంలో గునిపాటి వేణుగోపాల్, లావులూరి చరణ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

శీతల పానీయం తాగి చిన్నారులకు అస్వస్థత

● గ్రామస్థుల ఆందోళన

వీరబల్లి, ఆగస్టు 18: కాలం చెల్లిన శీతల పానీయం తాగడంతో తమ పిల్లలు అస్వస్థతకు గురయ్యారంటూ మండలంలోని ఓడివీడు గ్రామం కుమ్మరపల్లిలో కూటమి నాయకులు ఆదివారం ఆందోళన చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్నారులు బిందుప్రియ, జస్మిన్ తేజ్ స్థానికంగా ఉన్న ఓ దుకాణం టెట్రా ప్యాక్‌లో ఉన్న ప్రముఖ కంపెనీకి చెందిన ఓ శీతల పానీయాన్ని కొనుగోలు చేసి తాగి అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారి కుటుంబ సభ్యులు దుకాణదారు వద్దకు వెళ్లి అడగగా, ఆ ప్యాక్‌లు సరఫరా చేసిన వ్యక్తిని అడగాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని రాజంపేట టీడీపీ పార్లమెంట్ మహిళా కార్యదర్శి మల్లూరు సునీత తెలిపారు. వాటిని సరఫరా చేసే వ్యక్తిని అడగగా కంపెనీ వద్దకు వెళ్లి అడిగితే న్యాయం చేస్తారని తెలిపారన్నారు. విషయం తెలుసుకున్న రాజంపేట జనసేన పార్టీ నాయకుడు రామా శ్రీనివాసులు, పాల ఏకరి సంఘం రాష్ట్ర నాయకుడు శివప్రసాద్ నాయుడు, బీజేపీ నేత వెంకటరామరాజు తదితరులు గ్రామానికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. గ్రామంలో ఉన్న 5 దుకాణాల్లో స్టాకును పరిశీలించగా అన్నింటిలో కాలం చెల్లిన టెట్రా ప్యాకెట్లు, బాటిళ్లు దర్శనమిచ్చాయి. దాంతో వారు అక్కడేనిరసన తెలిపి కాలం చెల్లిన జ్యూస్ బాటిళ్లు, టెట్రా ప్యాకెట్లు సరఫరా చేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న డీలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణం ఓడివీడు కుమ్మరపల్లిలో దుకాణాలను సంబంధిత అధికారులు మూసి వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామనిహెచ్చరించారు.



కాలం చెల్లిన శీతలపానీయం టెట్రా ప్యాకెట్లను చూపుతున్న టీడీపీ, జనసేన నాయకులు

కుక్కలున్నాయ్.. జాగ్రత్త!

● వాహనాల వెంటపడుతున్న కుక్కలు

● అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోని వైనం



రోడ్లపై సంచరిస్తున్న వీధి కుక్కలు

గాలివీడు, ఆగస్టు 16: మండల కేంద్రంలో వీధి కుక్కలు ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధాన రహదారిపై గుంపులు, గుంపులుగా తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులను వెంబడించి మరీ దాడులు చేస్తున్నాయి. దీంతో చిన్నారులు, పాదచారులు బెంబేలెత్తుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపైకి గుంపులు గుంపులుగా వచ్చి దాడులు చేస్తుండడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఇటీవల పలువురు గ్రామస్తులు, టీడీపీ నాయకులు స్థానిక ఎంఆర్‌వో, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శిని కలిసి వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వీధి కుక్కల దాడుల నుంచి రక్షించండి

వీధి కుక్కల దాడులు శృతిమించి పోతున్నాయి. రోడ్డుపై వెళ్లే వారిని వెంటాడి గాయపరుస్తున్నాయి. పలుమార్లు అధికారుల కు పిర్యాదు చేసినా ఫలితం లేదు. పంచాయతీ వారి వద్ద తగిన నిధులు లేకపోతే ఆ మొత్తాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నాం.

- మారువుణి అనంద్‌కుమార్ గ్రామస్థుడు

చర్యలు తీసుకుంటాం

వీధి కుక్కల కట్టడికి తగిన చర్యలు తీసుకుంటాం వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వీధికుక్కల తరలింపునకు ఏర్పాట్లు చేస్తాం.

- శ్రీనివాసులు, ఎంపీడీవో, గాలివీడు

జూనియర్ డాక్టర్ హత్య కేసు నిందితులను ఉరితీయాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 18: జూనియర్ డాక్టర్ హత్యాచారం నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ అన్నమయ్య జిల్లా ఆర్‌యంపీ పీయంపీ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాయచోటి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి నేతాజి సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నమయ్య జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కేవీఎస్ నాయుడు, జాయింట్ సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరశంకర్‌లు మాట్లాడుతూ ఏ రోజైతే మహిళలపై అత్యాచారాలు, దాడులు ఆగుతాయో అప్పుడు భారత దేశానికి స్వాతంత్రం వచ్చినట్లన్నారు. వైద్యుల ప్రాణాలకే దిక్కు లేకపోతే ఏం చేయాలన్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మహేల్ రవీంద్ర, ట్రెజరర్ అబ్బవరం దొరబాబు, చిన్నమండెం ఆర్ఎంపీల సంఘం ప్రెసిడెంట్ రామరాజు, సంబేపల్లె ప్రెసిడెంట్ నాయుడు, అబ్బవరం రెడ్డెయ్య, చాంద్‌బాషా, ఉమాశంకర్, గణేశ్ కుమార్, రంజిత్‌రాయల్, టీవీ రమణ, మోటకట్ల మోహన్, సూర్యప్రకాశ్, బాలుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజంపేట, ఆగస్టు 18 : పార్వతీపురం ఎస్‌బీవీడీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1971-72, 75-76 సంవత్సరానికి సంబంధించిన పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు కేవీ ప్రసాద్, తిరు వెంగలయ్య, సంజీవయ్య, చేపూరి బాలకృష్ణయ్య, అప్పటి సిబ్బంది రంగయ్య హాజరయ్యారు. నాటి హెడ్మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, బోడగాల నారాయణ, మేరువ లీలాకృష్ణయ్య, వెంకటయ్య, సుబ్బన్న, కేశవులు స్మరించుకుని వారికి ఘనంగా నివాళులర్పించారు. అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ప్రస్తుత హెడ్మాస్టర్ ఏడీ మధుసూదన్ ను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు బోడా దామోదర్, సుబ్బయ్య, వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బమ్మ, సుబ్బరాయుడు, శ్యామల వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని పరవశించిపోయారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు



రక్తదాన శిబిరంలో సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 18: స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పిలుపు నిచ్చారు. పట్టణంలోని దీపా బ్లడ్ బ్యాంక్‌లో ఆదివారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు కటారు శివప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారం భించారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం దొరకక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇటువంటి సందర్భంలో ఎంతో మంది యువకులు రక్తదానం చేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. బ్లడ్ బ్యాంక్ వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుగవాసి శ్రీనివాసులు, బడిశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.


26 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్లకు ఎంపిక చేస్తున్న వైద్యులు

రాయచోటిటౌన్, ఆగస్టు 18: మండల పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 26 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. 50 మందికి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 26 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 27 మందికి పరీక్షలు నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో పూజలు



ప్రత్యే అలంకరణలో కోదండరామస్వామి

రైల్వేకోడూరు, ఆగస్టు 18: పట్టణంలోని పగడాలపల్లెలో నిర్మించిన కోదండరామాల యంలో శనివారం నుంచి వేదపండితులు పూజలు, హోమాలు చేస్తున్నారు. ఆదివారం యాగశాల శుద్ధి, ప్రధాన కలశస్థాపన, చతుస్థానార్చన, కళావాహనం, రెండు రకాల హోమాలు, పూర్ణాహుతి, తిరుమంజనం, మహాభిషేకం, పంచామృతాభిషేకం, నేత్రోన్మీలనం, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం అన్న దానం, స్వామి వారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని గ్రామ ప్రజలు తెలిపారు.

సీఐని కలసిన కాపు నాయకులు



సీఐని సత్కరించిన కాపు నేతలు

రైల్వేకోడూరు, ఆగస్టు 18: రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన పసుపుల వెంకటేశ్వర్లును ఆదివారం రాష్ట్ర కాపునాడు కార్యదర్శి కటికం సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు నార్జాల మురళి అభినందనలు తెలిపారు. అందరికి న్యాయం చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని సీఐని కోరారు. అనంతరం శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

నాగారపమ్మకు పూజలు, బోనాలు సమర్పణ

సుండుపల్లె, ఆగస్టు18: సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలోని నాగారపమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టువస్త్రాలను సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు తలనీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

చిట్వేలి, ఆగస్టు 18 : స్థానిక కమ్మారాయుడు స్వామి ఆలయం సమీపంలో వీర బ్రహ్మేంద్ర స్వామి నూతన శిలాబింబ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు అలయ నిర్మాణ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు, కమిటీ వారు తెలియజేశారు. ఈనెల 19 సోమవారం ఉదయం 9.30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, 20న స్వామివారి గ్రామోత్సవం, నెల్లూరు ధనమ్మ బృందం ఆధ్వర్యంలో కోలాటం, 21న బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి యంత్ర ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, 11 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం జరగనుందన్నారు. ప్రతిరోజు అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ధర్మకర్త రామ్మోహన్‌నాయుడు కోరారు.

ఘనంగా ముత్తు మారమ్మ జాతర



కొలువైన ముత్తుమారమ్మ, అంబళ్లను సమర్పిస్తున్న మహిళలు

నందలూరు, ఆగస్టు 18 : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో ఆదివారం ముత్తుమారెమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి అంబళ్లను సమర్పించారు. ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏనుగుల బాలాంజనేయులు, టీడీపీ నాయకులు షేక్ మౌలా, పఠాన్ మెహర్‌ఖాన్, బీజేపీ మండల కార్యదర్శి మురళీ, అర్చకుడు భాస్కర్, వెంకటేశ్ పెద్దఎత్తున భక్తులు అమ్మవారి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. సాయంత్రం నిర్వహించిన కోలాటం భక్తులను అలరింపజేసింది.

గంగమ్మ ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



ఆలయంలో ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి


ఓబులవారిపల్లె, ఆగస్టు 18 : మండలంలోని గంగమ్మ ఆలయాన్ని ఆదివారం రైల్వేకోడూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, సతీమణి ముక్కా వరలక్ష్మి పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వ హించి ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో చ ర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు గుండయ్య నాయుడు, పున్నాటి వాసుదేవరెడ్డి, సూరపురాజు సుబ్బరాజు, కీర్తిపాటి విజయ భాస్కర్‌రాజు, జగత్ ప్రసాద్‌వర్మ, డి.కృష్ణంరాజు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, బీసీ నాయకులు నాగరాజుయాదవ్, టీడీపీ నాయకులు రమణారెడ్డి, నరసింహరాజు, సొలవ రమణరాజు, మాజీ సర్పంచ్ వై.కోట అడపాల బాలాజీ, జనసేన రాయలసీమ కన్వీనర్ జోగినేని మణి, లింగాల వెంకటేశ్ ఆచారి పాల్గొన్నారు.

నేటి నుంచి రామాలయం ప్రారంభోత్సవాలు



నూతన రామాలయం

పెనగలూరు, ఆగస్టు 18 : మండలంలోని పొందలూరు హరిజనవాడలో రూ. 70 లక్షల వ్యయంతో నిర్మించిన రామాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని గ్రామపెద్దలు తెలిపారు. సోమవారం గణపతిపూజ, హోమం , మంగళవారం పూజలు. బుధవారం చెక్కభజన, కోలాటం భజన, గురు వారం విగ్రహ ప్రతిష్ఠ, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం సీతారాముల కల్యాణో త్సవం, రాత్రికి బ్రహ్మోత్సవాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించను న్నట్లు తెలిపారు.



రూ.1,570 కోట్ల పెట్టుబడులతో 15 పరిశ్రమలకు ప్రారంభోత్సవం

రూ.900 కోట్లతో ఏడు పరిశ్రమలకు భూమిపూజ

రూ.1,213 కోట్లతో ఐదు పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు

నేడు శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలోని శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రూ.1,570 కోట్ల పెట్టుబడులతో, 8,480 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఏర్పాటైన 15 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. రూ.900 కోట్ల పెట్టుబడులు, 2,740 మందికి ఉద్యోగాలు కల్పించే ఏడు పరిశ్రమలకు భూమిపూజ చేయనున్నారు. అలాగే రూ.1,213 కోట్ల పెట్టుబడితో 4,060 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే మరో ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు.

- సత్యవేడు

పర్యటన వివరాలిలా..

సీఎం కార్యాలయం నుంచి అందిన అధికారిక షెడ్యూలు ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ 10.40 గంటలకు విమానంలో బయల్దేరి 11.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసిటీ వెళతారు. శ్రీసిటీలో బిజినెస్ సెంటర్ సందర్శించి మధ్యాహ్నం 2.30 వరకూ రెండు గంటల పాటు అక్కడే గడపనున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న పరిశ్రమలను ప్రారంభించడంతోపాటు కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు భూమిపూజ చేస్తారు. అలాగే ప్రతిపాదిత పరిశ్రమల స్థాపనకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. ఈ కార్యక్రమాలు ముగించుకుని మధ్యాహ్నం 2.40 గంటలకు శ్రీసిటీ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుని మూడు గంటలకు విమానంలో బయల్దేరి గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

ప్రారంభించనున్న పరిశ్రమలు ఇవే!

శ్రీసిటీలో ఎల్జీ పాలిమర్స్, నైడెక్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియో లింక్ టెలికమ్యూనికేషన్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్ లైనెన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, జేజీఐ మెటల్ కన్వెర్ట్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ ఫైన్ మౌల్డర్స్, ఆటోడేటా, ఎస్కే కాంపొనెంట్స్, అడ్మైర్ కేబుల్స్, బాంబో కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ తదితర 15 పరిశ్రమలతోపాటు శ్రీసిటీ ఈఎంసీ ఫైర్ స్టేషన్‌ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పరిశ్రమలు ఇండియాతోపాటు జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఇజ్రాయెల్ తదితర దేశాలకు సంబంధించినవి.

భూమిపూజ చేయనున్నవి

బ్లూస్టార్, ఎన్జీసీ ట్రాన్స్‌మిషన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, టీఐఎల్ హెల్త్ కేర్, ఏజీపీ సిటీ గ్యాస్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, వెర్మిరెన్ రిహాబ్ తదితర ఏడు పరిశ్రమలతోపాటు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ పరిశ్రమలు మనదేశంతోపాటు జపాన్, బెల్జియం, చైనా తదితర దేశాలకు చెందినవి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

అధికారుల పరిశీలన

శ్రీసిటీలో ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించారు. ఏర్పాట్లను పరిశీలించారు.

శ్రీసిటీకి ఆరోసారి వస్తున్న బాబు

చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో శ్రీసిటీ పర్యటనకు సోమవారం ఆరోసారి విచ్చేయనుండడం విశేషం. శ్రీసిటీ సెజ్ ఏర్పాటయ్యాక 2015 ఏప్రిల్ 3న తొలిసారి పెప్సీ పరిశ్రమ ప్రారంభానికి విచ్చేశారు. అదే రోజు శ్రీసిటీలో 11 పరిశ్రమలకు భూమిపూజ చేశారు. 2016 ఏప్రిల్ 25, 27 తేదీల్లో రెండుసార్లు వచ్చారు. మాండలెజ్, ఇసుజు పరిశ్రమల ప్రారంభోత్సవాలు చేశారు. 2018 జనవరి 9న అపోలో టైర్స్ పరిశ్రమ భూమిపూజకు, 2018 మార్చి 23న హీరో మోటార్స్ పరిశ్రమ భూమిపూజకు శ్రీసిటీకి విచ్చేశారు. ఇక వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారైనా శ్రీసిటీకి రాని సీఎంగా జగన్ నిలవడం గమనార్హం.

ఐదు సంస్థలతో ఒప్పందాలు

డైకిన్, యాక్సెలెంట్ ఫార్మా, ఆర్మ్ వెస్ట్ మిర్రైటెక్ ఇండియా, క్యాప్ మ్యాన్ ఇండియా, పీఐ ప్రిస్టేజ్ ఇంటర్నేషన్ తదితర ఐదు పరిశ్రమల ఏర్పాటుకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలు కుదుర్చుకుంటారు. ఇవన్నీ మన దేశంతోపాటు జపాన్, సింగపూర్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదిర దేశాలకు సంబంధించినవి. అనంతరం శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

పటిష్ఠ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18: శ్రీసిటీ పర్యటనకు సీఎంతోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు వస్తుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. డీజీపీ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు స్వీయ పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 150 మంది కానిస్టేబుళ్లు, 60 మంది రిజర్వు బలగాలు, రోప్‌పార్టీలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు బందోబస్తులో ఉన్నాయి. వీరితోపాటు కాన్వాయ్ పార్టీలో ఆరు బృందాలున్నాయి.

చంద్రబాబు 70 రోజుల పాలనలోనే.. శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు

- 6,800 మందికి ఉద్యోగావకాశాలు
- గతంలో సీఎంగా వుండగా వంద పరిశ్రమల ఏర్పాటు
- ఇపుడూ అదే చొరవ.. పట్టుదల

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టి నేటికి కేవలం 70 రోజులవుతోంది. ఈ స్వల్ప వ్యవధిలోనే జిల్లాలోని శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 6,800 మంది యువతకు ఉద్యోగాలు కల్పించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. గతంలో 2014-19 నడుమ సీఎంగా వున్న సమయంలో ఆయన చొరవ కారణంగా ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీలో ఏర్పాటైన సంగతి తెలిసిందే. తాజాగా పాలనపై పట్టు రావాలని కాలయాపన చేయకుండా అధికారంలోకి వచ్చీరాగానే సొంత జిల్లా పట్ల, ప్రత్యేకించి పారిశ్రామిక అభివృద్ధి పట్ల అదే చొరవ, పట్టుదల వ్యక్తమవుతుండడం జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు నింపుతోంది. చంద్రబాబు చొరవ, పట్టుదల చూస్తుంటే రానున్న రోజుల్లో శ్రీసిటీకి తద్వారా జిల్లాకు పారిశ్రామికంగా భారీ పెట్టుబడులు, ప్రయోజనాలు సమకూరే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

సగం పరిశ్రమలు బాబు హయాంలోనే ఏర్పాటు

సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల పరిధిలో నెలకొల్పిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో ప్రస్తుతం 220 పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ పరిశ్రమల ద్వారా రూ.45వేల కోట్ల పెట్టుబడులు జిల్లాకు వచ్చాయి. వీటిలో 62వేల మంది ఉద్యోగులు పని చేస్తుండగా 70 శాతం మంది రాష్ట్రానికి చెందిన వారుండగా మొత్తం మీద 40 శాతం మంది జిల్లావాసులున్నారు. శ్రీసిటీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైనప్పటికీ అందులో పరిశ్రమల స్థాపనకు 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. సొంత జిల్లా కావడంతో ఆయన శ్రీసిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఆ ఐదేళ్లలో ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయి. వాటిలో పెప్సీకో, మాండలెజ్, ఇసుజు, ఫాక్స్ కాన్, హీరో మోటార్స్, అపోలో టైర్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమల కారణంగా పారిశ్రామిక పటంలో జిల్లా కీర్తిప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడించాయి.



ప్రారంభానికి సిద్ధమైన ఈప్యాక్ డ్యూరబుల్ కంపెనీ

వైభవంగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు



తిరువీధి ఉత్సవానికి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, తెప్పపై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

వెదురుకుప్పం, ఆగస్టు 18: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం స్వామివారు స్కంద పుష్కరిణిలో తెప్పపై విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం ముందుగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగాయి. టీటీడీ డిప్యూటీ ఈవో నాగలక్ష్మి, ఆలయాధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు



పలమనేరు, ఆగస్టు18 : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరసింహ రాజు కథనం మేరకు.. ఆదివారం పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. బెంగళూరు వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో 16కేసుల్లో మద్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 1100 టెట్రా ప్యాకెట్లు, 48 బీర్లు ఉన్నాయి. కారు నడుపుతున్న పుంగనూరుకు చెందిన రాజేష్(36)ను అదుపులోకి తీసు కున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.75,600, కారువిలువ రూ.2.5 లక్షలు ఉంటుంది. పలమనేరు ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు మద్యాన్ని పట్టుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, ఆగస్టు 18: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు వినతులు సమర్పించవచ్చునని పేర్కొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. బాధిత ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకోవచ్చునని వెల్లడించారు.

దేవరెద్దుకు పూజలు



దేవరెద్దును తీసుకొస్తున్న ఏఎల్‌పురం గ్రామస్తులు, పూజలు చేస్తున్న వేదగిరి వంశస్థులు

గుడిపాల, ఆగస్టు 18: మండలంలోని ఏఎల్‌పురంలో దేవరెద్దుకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ గతంలో ఉన్న దేవరెద్దు మృతి చెందడంతో ఐరాల మండలం వేదగిరివారిపల్లె నుంచి తీసుకొచ్చేందుకు వేదగిరి వంశస్థులు అభిషేకం, పూజలు చేయించారు. ఈ ఎద్దుకు ఏటా దేవరపబ్బం నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థులకు డెంగ్యూ

పుంగనూరు రూరల్, ఆగస్టు18: ఇద్దరు విద్యార్థులకు డెంగ్యూ జ్వరం సోకి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన భార్గవ్(13) కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. మూడు రోజుల కిందట జ్వరం రావడంతో ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ అని నిర్ధారణ అయింది. అలాగే, పలమనేరు మండిపేటకోటూరుకు చెందిన మూడో తరగతి విద్యార్థిని మోక్షిత(9) కూడా డెంగ్యూ జ్వరంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

పంట పొలాలపై ఏనుగుల దాడి

వరి, చెరకు పంటలకు తీవ్రనష్టం



ఐరాల, ఆగస్టు 18: మండలంలోని పోతపోలఇండ్లలో శనివారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసింది. వరి, చెరకు పంటలను ధ్వంసం చేశాయి. జయమ్మ, రఘునాథ్, భాస్కరయ్యకు చెందిన వరి, హరి, రామకృష్ణకు చెందిన చెరకు తోటను ఏనుగులు తొక్కి, తిని, ధ్వంసం చేశాయి. సుమారు మూడు ఎకరాలలో పంటను నాశనం చేశాయి. పోతపోలఇండ్లు అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉండటంతో ఏనుగులు తరచూ పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి, నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో కస్తూరిబా పాఠశాల ఆయా మృతి



సెల్వి మృతదేహం

కుప్పం, ఆగస్టు 18: కుప్పం మండలం పరమసముద్రం వద్ద ఉన్న కస్తూరిబా గురుకుల పాఠశాల బాలికల వసతి గృహంలో ఆయా (హౌస్ కీపర్)గా పనిచేస్తున్న సెల్వి (50) అనుమానాస్పదరీతిలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈమె పదేళ్లుగా ఇక్కడ పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం తన వొంటిమీది కమ్మలు వేరొకరికి తీసిచ్చారు. కొద్దిసేపటి తర్వాత చూస్తే వసతి గృహం ఆవరణలోని నీటి సంపులో సెల్వి పడిపోయి కనిపించారు. వెంటనే వెలికి తీసి కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందారు. ఆదివారం ఎంఎస్‌పీ నేతలు దేవరాజ్, మురుగేశ్, గోవిందప్ప, కోదండప్పలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సెల్వి మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెల్వి మృతికి గల కారణాలను వెలికితీసి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. మృతురాలి భర్త వి.మునిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు తెలిపారు.

పులి దాడిలో ఆవు మృతి!



చనిపోయిన ఆవును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె, ఆగస్టు 18: పులి దాడిలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. పెద్దకొండామారి పంచాయతీ రాజనాలబండ సమీపంలోని బోడిపై ఇండ్లకు చెందిన బాషా ఆవులు మేపుకుంటు జీవనం సాగించేవాడు. రెండు రోజుల క్రితం మేతకు వెళ్లిన తన పాడి ఆవు తిరిగి ఇంటికి రాలేదు. ఈక్రమంలో రెండు రోజుల నుంచి రాజనాలబండ సమీపంలోని అటవీప్రాంతంలో ఆవు కోసం గాలిస్తున్నారు. రాజనాలబండ అటవిప్రాంతంలో పులి దాడిలో ఆవు మృతి చెంది పడి ఉండగా గుర్తించారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు అడుగులు, దాడి తీరును పరిశీలించి పులి దాడి చేసిఉంటుందన్నారు. చుట్టు పక్క గ్రామాలలో పశువుల మేత కోసం అడవిలోకి వెళ్లకూడదని చాటింపు వేయించారు. తన జీవనాధారమైన రూ.70వేల విలువైన ఆవు మృతి చెందటంతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాషా కోరారు.

రంకేసిన కోడె గిత్తలు

గడ్డంవారిపల్లెలో పశువుల పండుగ



కల్లూరు, ఆగస్టు 18: పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లిలో ఆదివారం ఘనంగా పశువుల పండుగ నిర్వహించారు. ఏటా జనవరిలో పశువుల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. కొన్ని అనివార్య కారణాలతో జనవరిలో పశువుల పండుగ నిర్వహించలేదు. దీంతో ఈ గ్రామంలో ఆదివారం పశువుల పండుగ జరిపారు. ముందుగా గ్రామంలోని రాజవీధిలో గ్రామదేవతకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పశువులను అలంకరించారు. కొమ్ముల మధ్య చెక్క పలకలు, కొత్త టవళ్లు చుట్టారు. రాజవీధికి పశువులను తీసుకొచ్చి పరుగు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. పశువుల పరుగును తిలకించేందుకు వచ్చిన జనంతో గ్రామం కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, సర్పంచులు షుకూర్, మధు, అనితగోపినాధరెడ్డి, వెంకటేష్, ఎంపీటీసీ రెడ్డిఅహ్మద్, టీడీపీ నాయకులు రవినాయుడు, నాగరాజనాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 18: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచీ వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలన్నీ నిండిపోయాయి. ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పించేలా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



గంగమ్మను దర్శించుకోవడానికి క్యూలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, ఆగస్టు18: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

అక్రమార్కులపై తిరుపతి ఎస్పీ కొరడా

- గ్రావెల్ అక్రమ రవాణాకు సహకరించిన హెడ్‌కానిస్టేబుల్, హోం గార్డు సస్పెన్షన్
- చంద్రగిరి సీఐకి చార్జి మెమో
- అనధికారిక జరిమానా వసూలు చేస్తున్న మరో హోంగార్డుపైనా వేటు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18: అక్రమార్కులపై ఎస్పీ సుబ్బరాయుడు కొరడా ఝుళిపించారు. ఓ హెడ్ కానిస్టేబుల్‌తోపాటు ఇద్దరు హోంగార్డులను ఆదివారం సస్పెండ్ చేశారు. ఓ సీఐకి చార్జి మెమో ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలంలోని గంగుడుపల్లె, మండపంపల్లె గ్రామాల సమీపం నుంచి మల్లయ్యపల్లె మీదుగా గ్రావెల్ తవ్వి టిప్పర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ అధికారుల కళ్లు కప్పి కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ అవినీతి తంతుపై చంద్రగిరి సీఐ రామయ్యకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా హెడ్‌కానిస్టేబుల్ ఎస్.బసవయ్య, హోంగార్డు సుధాకర్‌లను వెంటనే గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోవాలని ఆదేశించారు. సీఐ ఆదేశాలను వారు పట్టించుకోలేదు. మరోవైపు ఈ అంశంపై స్థానికులు కొందరు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన ఆయన గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నవారికి తమ సిబ్బంది వంత పాడినట్లు నిరూపణ అయింది. దాంతో చంద్రగిరి సీఐ రామయ్యకు చార్జి మెమో జారీ చేశారు. రక్షక్ మొబైల్ హెడ్‌కానిస్టేబుల్ బసవయ్య, హోంగార్డు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. శాఖాపరమైన విచారణకూ ఆదేశించారు. అలాగే తిరుపతి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై అనధికారికంగా జరిమానా విధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు అందింది. విచారణలో అక్రమ వసూళ్లు చేస్తున్నది నిజమని తేలడంతో అతడినీ సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏ స్థాయి అధికారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో ఏడు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. బైరెడ్డిపల్లిలో 28.6, వి.కోట 8.2, రామకుప్పం 8.2, శాంతిపురం 4.6, చౌడేపల్లి 4.2, పలమనేరు 3.4, పుంగనూరులో 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

త్వరలో జేసీ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18: జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను జిల్లాకు జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

వేధింపులతో వివాహిత ఆత్మహత్య


మృతురాలు అర్షియ

వాల్మీకిపురం, ఆగస్టు 18: అత్త వారింట వేధింపులు తాళలేక అర్షియ(22) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వాల్మీకిపురం పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ ప్రసాద్ బాబు, ఎస్ఐ శ్రీహరిల కథనం మేరకు..వాల్మీకిపురం పట్టణానికి చెందిన అమీర్‌జాన్ కుమారుడు వసీమ్(24)కు పీలేరు పట్టణం మల్లెల వీధికి చెందిన మల్లెల రెడ్డిబాషా కుమార్తె అర్షియ(22)తో ఏడాదన్నర క్రితం ఫేస్‌బుక్ ద్వారా ఏర్పడ్డ పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. అప్పటికే కువైట్‌లో ఉద్యోగ రీత్యా ఉన్న వసీం పెళ్లి జరిగిన ఒకటన్నర నెల తర్వాత తిరిగి ఉద్యోగ నిమిత్తం కువైట్‌కు వెళ్లిపోయాడు. ఇక అప్పటి నుంచి అర్షియ వాల్మీకిపురంలోని అత్తామామలతోనే ఉంటోంది. అయితే గత కొద్దినెలలుగా ఆమెను అత్తామామ, మేనమామ మన్సూర్ అలీ అలియాస్ శీనయ్య, ఆడపడుచులు కట్నం కోసం తీవ్రంగా వేధించసాగారు. ఈనేపథ్యంలో అర్షియ తన భర్త వసీంకు పలుమార్లు చెప్పినా అతను పట్టించుకోలేదు. జరుగుతున్న వేధింపులు, గొడవల విషయమై శనివారం ఉదయం పీలేరులోని తన అమ్మగారింటికి వెళ్లిన అర్షియ తిరిగి సాయంత్రం వాల్మీకిపురంలోని అత్తవారింటికి చేరుకుంది. ఇంటికి వచ్చిన గంట వ్యవధిలో అర్షియ సెల్‌ఫోన్ పనిచేయకపోవడం అనుమానం వచ్చిన తల్లిదండ్రులకు తమ కుమార్తె ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో వాల్మీకిపురంకు చేరుకోగా అప్పటికే ఉరి వేసుకుని మృతి చెంది వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో ఉండడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం ఇంటికి వచ్చి కష్టాలు, బాధలు చెప్పుకున్న తమ కుమార్తె సాయంత్రానికి శవంగా మారడంతో బోరున విలపించారు. పూర్తిగా తమ కుమార్తె అర్షియను భర్త వసీం, అత్తామామలే అదనపు కట్నం, వేధింపులతో హతమార్చి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి కుటుంబీకులు ఆరోపించారు. అర్షియ ఆత్మహత్యకు పాల్పడిన ఇంటిని సీఐ ప్రసాద్ బాబు పరిశీలించి క్లూస్ టీం ద్వారా పలు వివరాలను సేకరించారు. స్థానిక ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అర్షియ భర్త వసీం, అత్తామామలు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 18: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు అనంతపురం పట్టణం, కక్కలపల్లె మంగళకాలనీకి చెందిన రజియా(90) నరాల సంబంధించిన వ్యాధితో తీవ్ర అనారోగ్యంకు గురికాగా ఆయుర్వేద చికిత్స కోసం ఆమె ఇంట్లో పని చేసే ఫరీదా(45), బంధువు నూర్‌అహ్మద్, టవర్ క్లాక్ గుల్జార్‌పేటకు చెందిన అస్లాం(54)తో కలిసి చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం విరపాక్షపురానికి కారులో వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో మదనపల్లె పట్టణం, పుంగనూరు రోడ్డులోని నైజంక్షన్ వద్ద సీటీఎం నుంచి పుంగనూరుకు పైపుల లోడులో వెళుతున్న బొలెరో వాహనాన్ని ఎదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా ఫరీధా తీవ్రంగా గాయపడ్డారు. ఆమెతోపాటు బికొత్తకోట ఇందిరమ్మ కాలనీకి చెందిన బొలెరో వాహన డ్రైవర్ రామాంజి(33)గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు ప్రైవేటు ఉద్యోగులు మరో రోడ్డుప్రమాదంలో గాయపడ్డారు. మదనపల్లె పట్టణం, కమ్మవీధికి చెందిన వినయ్‌కుమార్ (38)బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం మదనపల్లెలోని ఇల్లు బాడుగకు ఇచ్చేందుకు వచ్చి ఎస్బీఐ కాలనీలో ఉన్న స్నేహితుడు నాగేంద్రకుమార్(37)తో కలిసి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలో చీకలబైలు పంచాయతీ, తాల్‌రెడ్డి గెస్ట్‌హౌస్ సమీపంలో వెనకనుంచి వేగంగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు గాయపడిన వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వినయ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రెఫర్ చేశారు. తాలుకా పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ, ఆగస్టు 18:గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంలో వెళుతున్న ఇద్దరికి గాయాలైన సంఘటన సూరప్పగారిపల్లె వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల మేరకు చిన్నమండెం మండలం కేశాపురానికి చెందిన సాలమ్మ(39), శంకర(40) దంపతులు ద్విచక్ర వాహనంలో గుర్రంకొండ మండలంలోని సుంకరవాండ్లపల్లెలోని బంధువుల ఇంటికి ఆదివారం ఉదయం వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మార్గ మధ్యంలోని సూరప్పగారిపల్లె వద్ద వారు ప్రయాణిస్తున్నవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సాలమ్మ, శంకరకు రక్తగాయాలుకాగా గాయపడిన బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లి, ఆగస్టు 18: కుటుంబ కలహాలతో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి సంఘటన ఆదివారం మండలంలో చోటు చేసుకొంది. మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతి బొంగవారిపల్లికి చెందిన పల్లవి(19) భర్త మద్యం తాగి వచ్చి కొట్టడంతో మనస్తాపానికి గురైన ఇంట్లోని పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడంది. అపస్మారక స్థితిలో ఉన్న పల్లవిని గమనించిన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఆస్పత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఎలాంటి పిర్యాదు అందలేదని తెలిపారు.

దాడిపై కేసు నమోదు

కలకడ, ఆగస్టు 18:ద్విచక్ర వాహనం కిందపడ్డ విషయమై రెడ్డెయ్యనాయుడు అతని కుటుంబ సభ్యులపై దాడి చేసిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజినేయులు తెలిపారు. ఈనెల 10వ తేదీన రాత్రి గంగాపురంలో గ్రామదేవత విరూపక్షమ్మ జాతరకు గ్రామస్థుడు రెడ్డెయ్యనాయుడు అమ్మవారి దర్శనానికి వెళుతుండగా వీధిలో కిందపడి ఉన్న ద్విచక్ర వాహనాన్ని నిలబెడుతుండగా దాని యజమాని నాగరాజు అతని అనుచరులు ప్రసాద్, వెంకటేశ్వర, గౌతమ్, చంద్రయ్య, వెంకటేశ్వర, ద్వారక, తిరుపతిలు రెడ్డెయ్యనాయుడు ఇంటి వద్దకు వెళ్లి మరణాయుధాలతో దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

వాల్మీకిపురం, ఆగస్టు 18: వాల్మీకిపురం పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మురళిని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మురళి తండ్రి జనార్దన్ గత రెండు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాల్మీకిపురం చేరుకుని కుటుంబీకులను పరామర్శించారు. ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు కృష్ణారెడ్డి, రమణ, పీవీ నారాయణ, చంద్రమౌళి, రమేష్, రాజేంద్రాచారి, సయ్యద్‌బాషా, రామచంద్ర, చాను, కువైట్ సయ్యద్‌బాషా, ఆనంద, సాదిక్, జంషీద్, జావీద్, సైదు, ఆదినారాయణ పాల్గొన్నారు.

పల్లెల్లో చోరీలు.. ఆందోళనలో ప్రజలు

● పట్టపగలే ఇంటి తాళాలు పగులగొట్టి పేదల ఇళ్లు గుల్ల చేస్తున్న దుండగులు ● పోలీసులు నిఘాపెంచాలంటూ వేడుకోలు


పసలవాండ్లపల్లి చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దమండ్యం, ఆగస్టు18: దొంగలు రూటు మార్చారు. ఇప్పటి వరకు పట్టణాలనే టార్గెట్ చేస్తున్న దుండగులు ప్రస్తుతం పల్లెల వైపు పాగావేశారు. ముఖ్యంగా పేదలు, కూలీలు వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు వెళుతుండడాన్ని పసిగట్టిన దొంగలు పట్టపగలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 1గంట మధ్యలో ఇంటిలో ఎవరూ లేని సమయం చూసి ఇంటి తాళాలు పగులగొట్టి దొరికినకాడికి నగదు, ఆభరణాలు తదితరవాటితో ఉడాయిస్తున్నారు. దీంతో పేదలు ఏమిచేయాలో పాలుపోక భయాందోళనలతో అటు పనులు వదుకోలేక ఇటు చోరీలను అడ్డుకోలేక సతమతమవుతున్నారు. పోలీసులు పట్టణాలతోపాటు కనీసం పగటిపూట పల్లెల్లో ప్రత్యేక నిఘా పెంచి చోరీలను అడ్డుకోవాలని పల్లెవాసులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ పసలవాండ్లపల్లిలో రెండు రోజుల క్రితం పట్టపగలే రెండు ఇళ్లలో చోరీలు జరిగాయి. ఆదివారం వేలిముద్ర నిపుణులు వాటిని పరిశీంచి బీరువాలపై వేలిముద్రలు సేకరించారు. పల్లెల్లోని ప్రజలు వ్యవసాయ పనులలో బిజీగా ఉన్న సమయం పగలు12 నుంచి 1గంటల మధ్య అదునుగా దుండగులు ద్విచక్రవాహనాలలో వచ్చి చాకచక్యంగా ఇళ్లకు వేసిన తాళాలు ధ్వంసం చేసి చొరబడి బీరువాల ధ్వంసం చేసి విలువైన బంగారం, వెండి లక్షలు విలువ చేసే ఆభరణాలు, నగదు చోరీకి పాల్పడుతున్నారు. ఇంటిలో చొరబడిన కేవలం 10 నిమిషాల వ్యవధిలో చోరీలు ముగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. బాధితులందరు నిరుపేదలు కావడంతో వారి బాధలు వర్ణాతీతంగా మారియి. కాగా గత 6 నెలల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లా, కడప జిల్లాలో గత డిశంబరు 23వ తేదిన ఒక్క రోజులోనే ఒకే సమయంలో పెద్దమండ్యం, తంబళ్లపల్లి, వాల్మీకిపురం, గుర్రంకొండ, కలకడ, లక్కీరెడ్డిరెడ్డిపల్లి మండలాల్లో దుండగులు చోరీలకు పాల్పబడిన విషయం తెలిసిందే. అప్పట్లో జిల్లాల్లో ఈ చోరీలు సంచలనం సృష్టించాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేసులను గుర్రంకొండ పోలీసులు అప్పుడే రెండు రోజులలోనే చేధించి దొంగలను అరెస్టు చేసి, బంగారు, వెండి,ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసుల్లో తమిళనాడు కుచెందిన ఇద్దరు దొంగలను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పట్టపగలే జరుగుతున్న చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కురబలకోట, ఆగస్టు 18: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ముదివేడు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ పందివానిపెంట గ్రామానికి గోపాలు భార్య రాజమ్మ(55) ఇంట్లో ఒంటరిగా జీవిస్తుంది. ఈమె కుమారులు పట్టణంలో స్థిరపడ్డారు. కాగా ఇంటి నుంచి కుళ్లిన దుర్వాసనలు రావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటనాస్థలానికి చేరుకుని విచారించారు. కాగా ఆమె రోజు వేసుకునే బంగారు చైన్ లేకపోవడం పలు అనుమానాలకు కలుగుతున్నాయి. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, ఆగస్టు18:జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం చేనేతనగర్ సమీపంలో జూదం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడిచేశామన్నారు.ఇందులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.15,120నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 18 : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలాజీ, ఈవో పీఆర్డీ స్వామిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిక్షణ తరగతులను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీల్లోని వివిధ రకాల విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, ఘన, వ్యర్థ పదార్థలనిర్వహణ, చెత్త సేకరణ, వర్మీకం పోస్ట్, తయారీ, పంచాయతీల అభివృద్ధికోసం ప్రణాళికల తయారీ తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని వారు కోరారు..

కలికిరిలో: మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం నుంచి మూడు రోజులపాటు వరుసగా పునశ్చరణ శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. జీపీడీపీ పథకం కింద గ్రామ పంచాయతీల ప్రణాళికలు సిద్ధం చేయడం, ద్రవ, ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ వంటి పలు అంశాల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో జరిగే ఈ పునశ్చరణ శిక్షణకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని గంగయ్య కోరారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండల సర్పంచులు, గ్రామ పంచాతీ కార్యదర్శులు, ఎంపిక చేసిన గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌రావు వెల్లడించారు. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 21 వరకు మూడు రోజులు మండల స్థాయి శిక్షణ తరగతులు జరుగనున్నట్లు తెలిపారు. ఈ శిక్షకు సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపిక చేసిన జీఎస్ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుర్రంకొండ, ఆగస్టు 18:గుర్రంకొండ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు రీడో సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా 59 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రీడో సంస్థ కార్యదర్శి ఈశ్వరయ్య, ప్రిన్సిపాల్ సాయిశిరీషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంకర పరిచారు... రోడ్డు మరిచారు


కంకర పరిచి వదిలేసిన మర్రోల్లపల్లె రోడ్డు

బి.కొత్తకోట, ఆగస్టు18: బి.కొత్తకోట మండల పరిధిలోని మర్రోల్లపల్లె, ఎద్దులవారిపల్లె గ్రామాలకు తారురోడ్డు వేస్తామంటూ ఉన్నరోడ్డును తవ్వేసి 40యంయం కంకర పరిచేశారు. దానిమీద రోలర్ తొక్కించి, గ్రావెల్ డస్ట్ పరిచి తారు వేయడం మరిచారు. దీంతో ఆ కంకర మీదుగా ద్విచక్రవాహనాలలో వెళ్లలేక, కాలినడక కూడా సాగించలేక ఈ రెండుగ్రామాల ప్రజలతో పాటు, ఆ మార్గంలో వ్యవసాయ భూములు కలిగిన రైతులు లబోదిబో మంటున్నారు. ఈ గ్రామాలకు బస్ సౌకర్యం లేకపోవడంతో మల్లెల క్రాస్ నక్కరాజుపల్లె నుంచి హంద్రీ-నీవా కాలువ వడ్డు మీదుగా గ్రామస్తులు కాలినడకన వెళ్లేవారు. ఈ రెండు గ్రామాల సౌకర్యం కోసం రోడ్డు నిర్మాణం జరుగుతుందంటే ప్రజలు చాలా సంతోషించారు. అయితే ఆ రోడ్డు అర్థాంతరంగా ఆగిపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కంకర పరిచి వదిలేసిన రోడ్డును పూర్తి చెయ్యాలని కోరుతున్నారు.

26 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఆగస్టు 18: మండల పరిధిలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 26 మందికి కంటి ఆపరేష న్లు నిర్వహించారు. 50 మందికి పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 26 మందికి ఆప రేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరే షన్ చేయించుకున్న 27 మందికి పరీ క్షలు నిర్వహించి మందులు, అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

26న జన్మాష్టమి వేడుకలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 18: స్థానిక అనపగుట్టలోని గోవర్ధనగిరి కృష్ణాలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24న ఆలయంలో బెంగళూరుకు చెందిన స్వామి శివానంద గీతా భజన మండలి సభ్యులతో భగవద్గీత పారాయణ ం జనుగుతుందన్నారు. 26న రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడికి అభిషేకాలు, అర్చనలు, విశేషపూజలతోపాటు స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం స్వామివారికి వసంతోత్సవం, ఉట్లోత్సవం అత్యంత వైభవంగా జరుతుందని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకృష్ణాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పొలిమేర గంగమ్మ జాతర


పొలిమేర గంగమ్మ

కలికిరి, ఆగస్టు 18: మండలంలోని చీకటిపల్లె పంచాయతీ రంగనాథపురం గ్రామంలో ఆదివారం పొలిమేర గంగమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులంతా గ్రామం వదిలి వలస వెళ్లి దేవర్లు ఏర్పాటు చేశారు. ఊర్లోని పాడుబడిన రుబ్బురోళ్ళు, బండ రాళ్ళను సేకరించి సాంప్రదాయబద్ధంగా ఊరి పొలిమేర దాటించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గ్రామస్థులంతా పాల్గొన్నారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఆగస్టు 18:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక మహిళలు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

విశ్వహిందూ పరిషత్‌కు 60 ఏళ్లు


మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రాంత సహకార్యదర్శి వర్రె కోటేశ్వరరావు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 18: విశ్వహిందూ పరిషత్‌కు ఆదివారంతో 60 ఏళ్లని ప్రధాన వక్త, ప్రాంత సహ కార్యదర్శి వర్రె కోటేశ్వరరావు, మదనపల్లె జిల్లా కార్యదర్శి సోంపల్లె సురేష్‌బాబు పేర్కొ న్నారు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవ్యాప్తం గా ఏకైక ధార్మిక సంస్థ విశ్వహిందూ పరిషత్ అని తెలిపారు. గత 60 ఏళ్లుగా ధార్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇందులో కరసేవకుల, శ్రీరామ సేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్ర మంలో గట్టి రామమోహన్, చింతపర్తి మహేష్, బండి ఆనంద్, బండి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో నేడు సీతారామ కల్యాణం

ఒంటిమిట్ట, ఆగస్టు 18 : ఆంధ్ర అయోధ్యగా పేరు గాంచిన కోదండ రామాలయంలో పౌర్ణమిని పురస్క రించుకొని టీటీడీ అర్చకులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కాగా, ప్రతి నెల పౌర్ణమి నాడు గిరి ప్రదర్శన నిర్వహించాలని స్థానిక బీజేపీ, ఆర్ఎస్ఎస్ సభ్యులతోపాటు భక్తులు నిర్ణయిం చారు. కోదండరామాలయం పెద్దకొత్తపల్లి, చిన్నకొత్తపల్లె, గంగపేరూరు, రాచగుంటపల్లె, సాలాబాద్, మలకాటిపల్లె మీదుగా 14 కిలోమీటర్ల మేర నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు రామాలయం నుంచి ప్రదక్షిణ ప్రారం భం అవుతుందని పాటూరు గంగిరెడ్డి తెలిపారు.

మాతమ్మకు పొంగళ్లు

పెనగలూరు, ఆగస్టు 18 : మండల కేంద్రంలోని అరుం ధతివాడలో ఆదివారం సాయంత్రం గ్రామ దేవత మాత మ్మకు మొగిలిచెర్ల కొంచం తప్పిట వంశస్తులు పొంగళ్లు సమర్పించారు. ఈ సందర్భంగామహిళలు గుడి ముందు పొంగళ్లు పొంగించి ముద్ద పెట్టుకుని కోడిపుంజులను బలిచ్చి గ్రామదేవతను శాంతింపజేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి


రక్తదాన శిబిరంలో సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, ఆగస్టు 18: స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగ వాసి ప్రసాద్‌బాబు పిలుపు నిచ్చారు. పట్టణంలోని దీపా బ్లడ్ బ్యాంక్ లో ఆదివారం టీఎన్ఎస్ఎఫ్ నాయ కులు కటారు శివప్రసాద్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారం భించారు. అనంతరం మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం దొరకక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఇటువంటి సందర్భంలో ఎంతో మంది యువకులు రక్తదానం చేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. బ్లడ్ బ్యాంక్ వారిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు సుగవాసి శ్రీనివాసులు, బడిశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం..ఇసుక రవాణాపై ఉక్కుపాదం


పోలీసు సర్కిల్ కార్యాలయం తనిఖీ చేస్తున్న డీఎస్పీ రామచంద్రరావ్

వాల్మీకిపురం, ఆగస్టు 18: నాటుసారా తయారీ, విక్రయాలు, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాల పట్ల ఉక్కుపాదం మోపుతామని రాయచోటి డీఎస్పీ రామచంద్రరావ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన వాల్మీకిపురం సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. అనంతరం సీఐ, ఎస్ఐలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సర్కిల్ పరిధిలో గల పోలీస్‌స్టేషన్ ప్రాంతాలలో రాత్రి గస్తీ ముమ్మరం చేసి నిఘా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులు, వాహనాలను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టాలన్నారు. విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా పట్ల నిఘా పెట్టాలని బయటి రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యాన్ని అడ్డుకుని కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సీఐలు ప్రసాద్‌బాబు, పులి శేఖర్, ఎస్ఐలు నాగేశ్వర్‌రావ్, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి


డిజిటల్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అశోక్

మదనపల్లె టౌన్, ఆగస్టు 18: మండలాల్లో గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిజిటల్ అసిస్టెంట్ల (గ్రేడ్-6 సెక్రటరి) అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటుస్కూల్లో అన్నమయ్య జిల్లా డిజిటల్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ డిజిటల్ అసిస్టెంట్లను డేటాఎంట్రీ ఆపరేటర్లుగా పరిగణిస్తున్నారని, సచివాలయాల్లో మిగిలిన ఉద్యోగుల లాగిన్ విధులను కూడా డిజిటల్ అసిస్టెంట్లకు కేటాయిస్తుండటంతో పనిఒత్తిడి పెరుగుతోందన్నారు. డిజిటల్ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రెడ్డిరాణి, కార్యదర్శిగా మహేష్, కోశాధికారులుగా హసన్, సుప్రియ, అదనపు కార్యదర్శిగా మల్లికార్జున, ఉప కార్యదర్శిగా దిలీప్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా మహేష్, సారిక, బాలాజి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కిశోర్, మోహన్, ఈసీ మెంబర్లుగా నాగరాజు, మల్లికార్జునలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి జిల్లా అధ్యక్షులు కళ్యాణ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా.. ఆగని మైనింగ్ మాఫియా

మదనపల్లె అర్బన్, ఆగస్టు18: ప్రభుత్వాలు మారినా మైనింగ్ మాఫియా రెచ్చిపోతూ ఇసుక, మట్టిని తరలిస్తూ పకృతిని నాశనం చేస్తున్నారని సీపీఎం జిల్లాకార్యదర్శి పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తీసుకున్న ఇసుక విధానం ప్రజలకు ఇసుక అందుబాటులో లేకుండా పోతోందని ఆరోపించారు. మైనింగ్ మాఫియా మాత్రం పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో పట్టణ సమీపంలోని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి, నిమ్మనపల్లె నుంచి ప్రతిరోజు రాత్రి 9 గంటల నుంచి ఉదయం 5గంటల వరకు టిప్పర్ల సహాయంతో లక్షల విలువ చేసే ఇసుకను తోడి పట్టణంలోకి వ్యాపార నిమిత్తం తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఇందుకు అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండడమేనని ఆయన ధ్వజమెత్తారు. మదనపల్లె ఎమ్మెల్యే మైనింగ్ మాఫియాను సహించేది లేదని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

రచయిత, సీనియర్ జర్నలిస్టు త్యాగమూర్తి శర్మ మృతి



మదనపల్లె టౌన్, ఆగస్టు 18: మదనపల్లె ప్రాంత రచయితలకు చిరపరిచితుడు, ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు పురాణం త్యాగమూర్తి శర్మ(85) ఆదివారం కన్నుమూశారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శర్మను కుటుంబీకులు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మదనపల్లె రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి యుగంధరాచారి మాట్లాడుతూ 25 ఏళ్లుగా మరసం సేవలో పురాణం అందించిన సేవలు ఎనలేనివన్నారు. సోమవారం ఉదయం 10గంటలకు మదనపల్లె పట్టణం పెంచుపాడురోడ్డులో పురాణం ఇంటి నుంచి అంత్యక్రియలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ పురాణం మృతి సాహితి లోకానికి తీరని లోటన్నారు. శర్మ మృతి పట్ల అపెక్స్ సంఘం అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామీణ మహిళలకు సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన


మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న స్త్రీ వైద్య నిపుణులు


పీలేరు, ఆగస్టు 18: గ్రామీణ మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి పరిణామాలు, రక్షణ చర్యలపై అవగాహన కలిగి ఉండాలని వైద్యులు సూచించారు. ఆదివారం కేవీ పల్లె మండలంలోని చింతమాకులపల్లెలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన శిబిరంలో ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ సృజన, డాక్టర్ అరుంధతి, డాక్టర్ విద్య, డాక్టర్ జిలాని, డాక్టర్ షమీమ్ ఆధ్వర్యంలో 47 మంది మహిళలకు పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అదే విధంగా శిబిరంలో పాల్గొన్న 131 మంది మహిళలందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీనివాస చారిటబుల్ ట్రస్టీ డాక్టర్ పీవీ బ్రహ్మరెడ్డి, సభ్యులు శ్రీనివాసరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, స్వచ్ఛంద సేవకులు రామాంజనేయులు, షబ్బీర్, బాషా, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రత..అందరి బాధ్యత


కొవ్వొత్తులతో నిరసన చేస్తున్న హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు


మదనపల్లె అర్బన్, ఆగస్టు 18: ఆడపిల్లలకు భద్రత అనేది కేవలం ఆలోచన కాదు.. ప్రతి ఒక్కరి బాధ్యత అని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అబూబకర్ సిద్దిక్ అన్నారు. ఆదివారం డాక్టర్ మోమిత హత్యకు సంఘీబావంగా కొవ్వొత్తుల నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలు పోసే డాక్టర్ మోమితపై అత్యాచారం చేసి క్రూరంగా హత్య చేసిన వారికి కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సభ్యులు హరికృష్ణ, షేక్ షా, హరి, సైతు, సాయి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐకి ఘనసన్మానం


నూతన సీఐ ని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

బి.కొత్తకోట, ఆగస్టు18: బి.కొత్తకోట పట్టణ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన కె.రాజారెడ్డిని పట్టణ టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టణానికి సీఐగా వచ్చినందుకు అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు అందరం సహకరిస్తామని స్టేషన్‌పరిధిలో సామాన్యులకు కూడా న్యాయం జరిగేలా చూడాలని సీఐని కోరారు. ఈ సందర్భంగా సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ చట్టానికి లోబడి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని అసాంఘిక కార్యకలాపాలకు నాయకులు సహకరించరాదని, నిందితులకు రక్షణగా నిలవరాదని కోరారు. సీఐని కలిసిన వారిలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దేవరింటి కుమార్, మండలతెలుగు యువత అధ్యక్షుడు గట్టుఅంజి, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సురేంద్ర, మాజీఉపసర్పంచ్ సమీవుల్లా, ఎండీ మస్తాన్, నాయకులు కుడుం రంజిత్, దేవుడునాగరాజు, శిల్పా అంజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం సీఐగా ప్రసాద్‌బాబు



వాల్మీకిపురం, ఆగస్టు 18: వాల్మీకిపురం నూతన సీఐగా ప్రసాద్ బాబు ఆదివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. రాయదుర్గం సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్‌బాబు బదిలీపై వాల్మీకిపు రంలో విధుల్లో చేరగా ఇక్కడ పనిచేస్తున్న పులి శేఖర్ పెనుగొం డకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా నూతన సీఐ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. అక్రమ మద్యం రవాణా, తయారీ, విక్రయాలపై ప్రజలు సహకరించి సమాచారం అందిస్తే తప్పక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.